# మిసిమి

మాస పత్రిక

ఆగష్టు - 2001



వెల రూ. 8/-



**రైట్**

**(1734 - 1797)**

## చిత్రకారుని గురించి

డెర్బీలో పుట్టిన కళాకారుడు రైట్ జీవితాంతం తాను జన్మించిన నగరంతో అత్యంత సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉన్నాడు. అక్కడ అతడు తన జీవితాన్ని ఒక పోర్ట్రెయిటిస్ట్‌గా ఆరంభించాడు. కాని అనతి కాలంలోనే అతడు కాంతి ప్రభావాల ఫలితాలను చూపెట్టే అద్భుతమైన చిత్రాలను చిత్రించాడు. ఈ 'కాండిల్ లైట్స్' ఆయనకు ఎనలేని పేరు తెచ్చిపెట్టాయి. అంతేకాదు దీనితో ఆయనకు సహజ మౌలిక చిత్రకారుడుగా గుర్తింపు వచ్చింది.

అతడిని మామూలుగా శాస్త్ర, పారిశ్రామిక సంబంధ విషయాలను చిత్రించే చిత్రకారునిగా గుర్తిస్తారు. కాని అతడు 1774లో ఇటలీ పర్యటించి వచ్చిన తరవాత సాహితీ విషయాలను తన చిత్రాలకు సబ్జెక్ట్సుగా తీసుకొని చిత్రించాడు. ఇటలీ స్థల దృశ్యాలు అనేక నాటకీయ ఇతివృత్తాలను అతనిలో రేపాయి. అలాగే అతడి తరువాతి ఇతివృత్తాలు ఆంగ్ల గ్రామీణ దృశ్యాలను చిత్రించినప్పుడు, చాల రసవత్తరంగా, కాల్పనికంగా తయారయ్యాయి. ఈ ఆంగ్ల గ్రామీణ కాల్పనిక చిత్రణం తరువాతి తరం స్థల దృశ్య చిత్రకారులకు మార్గనిర్దేశకాలయ్యాయి.

### ముఖ చిత్రం : సుసనాస్టెడ్

పదహారేళ్ళ వయస్సులో ఈ యువతికి గౌరవనీయ చార్లెస్ హోప్ అనే మతాధికారితో వివాహం అయిన కొద్ది కాలానికే దీనిని చిత్రించాడు. ఈ చిత్రంలో రైట్ గురువైన థామస్ హడ్సన్ ప్రభావం కనిపిస్తుంది. పోజు, సెట్టింగ్ సంప్రదాయకంగానే ఉన్నా, ఆమె యౌవ్వనంలోని తాజా తనానికి అతడు ప్రతిస్పందించిన తీరులో అతని వైయక్తికత గోచరిస్తుంది, అందులోని ముత్యాల వెలుగు ముచ్చట గొలుపుతోంది.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**


సంపుటి 13 | ఆగష్టు 2001 | సంచిక 8

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


మానసిక శాస్త్ర కోణాల్లోంచి ''అంపశయ్య'' విశ్లేషణ - ప్రొఫెసర్ నిరంజన్ రెడ్డి

కాలగర్భంలో కలిసిపోయిన రష్యన్ ఆత్మ పునరావిష్కారం - సి.ఎల్.ఎల్. జయప్రద

కవిత్వానికి కంచె - డా॥ యు. ఏ. నరసింహమూర్తి

వైవస్వత మనువు రూపుదిద్దిన ఈజిప్టు - సప్తసింధు నాగరికతలు - డా॥ ఎం. వి. ఎన్. కృష్ణారావు

సంస్కృత నాటక సాహిత్యం - ముప్వల సుబ్బరామయ్య

పత్రికల్లో పాపులర్ సైన్స్ - నాగసూరి వేణుగోపాల్



విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **సుసనాస్టైడ్**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536

E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# While in Japan ...
## do as they do and *don't* what they won't

- Take off your shoes before entering your host's home. Ensure that there are no holes in your socks !
- The Japanese are a naturally hygiene-conscious people, except when it comes to park and train toilets. So, no spitting, littering or "committing nuisance" in public places.
- No tipping. Except for a sure shot at the races.
- If you're someone's guest, soap yourself outside the bathtub. Get into it only for a rinse. Do *not* drain the water out, as the rest of the family will bathe in the same water. As an honoured guest, you get first go.
- The number "4" is inauspicious. No gifts should have four items or pieces. Certain hotels and hospitals dispense with Room No.4.
- If a funeral car passes by, hide your thumb. You may be mistakenly taken aboard for wanting to hitch a ride.
- Bow while greeting, thanking or apologising. Stop before you get a slipped disc !
- In a bar, never pour sake or beer into your glass. Pour it into your friend's. He / she will fill up your glass. If you get drunk, you can always blame it on the other guy / gal.
- Visiting cards should be presented with both hands, with the printed matter facing the receiver.
- If you are sitting on *tatami* mats in a restaurant or home, you can bow to someone while on your knees. Never stand on the mats.
- If you have a business appointment at 9 am, it means you should walk through the door at 8.55 am.
- During a negotiation, if you have to blow your nose, leave the room. Otherwise, you may blow the contract.
- There is no custom that remotely follows the "Ladies first" routine. Except, of course, in the maternity ward.
- When they laugh, Japanese women often cover their mouths in keeping with an old belief that showing bone is unclean.
- It is customary to say "*itadakimasu*" before eating, "*Gochisosama deshita*" after eating, if you're being treated. And "*Kanpai*!" for "Cheers!" Of course, the last one is the simplest to pronounce.
- Avoid boarding the Shinkansen (Bullet Train) during the rush hour as you may be pushed into the compartment by official "pushers" on the platform who ensure that more commuters fit into the train. Tinned sardines have an easier time.
- When welcoming guests, it is customary to hand them a small, moist, rolled-up towel called an "*oshibori*" for wiping their hands. The towel should be cold in summer and hot in winter. The order could be reversed, if the guests are unwelcome ones.
- Book your tee-off three months in advance. Don't collapse if your host tells you he plays to 48 handicap.
- If you're eating *sushi* or *sashimi*, have it in one gulp.
- If you play dumb charades and want to portray a steam engine, have a good helping of their horseradish sauce. You'll hoot and your ears will steam.
- In respectable company, remember that "Geisha" is not the name of the girl next door.

***- Compiled by SN***

# మానసిక శాస్త్ర కోణాల్లోంచి ''అంపశయ్య'' విశ్లేషణ

- ప్రొఫెసర్ నిరంజన్ రెడ్డి

'అంపశయ్య' నవలలో తీసుకోబడిన కథా వస్తువు యూనివర్శిటీ విద్యార్థుల హాస్టల్ జీవితానికి సంబంధించింది. ఈ కథా వస్తువును నవలగా మలచిన విధానం అత్యంత వాస్తవికంగా రూపొందింది. ఈ నవల రచయిత నవీన్ మానసిక శాస్త్రాన్ని.... ముఖ్యంగా **Freud** ప్రవచించిన మానసిక విశ్లేషణ'', **Pavlov** సూచించిన **"Conditioned Reflexes"** లాంటి సిద్ధాంతాలనే కాకుండా మానసిక శాస్త్రానికి చెందిన **"Adoloscent Psychology", "Abnormal Psychology", "Social Psychology"** మొదలైన శాఖల్ని కూడా బాగా అధ్యయనం చేశాడనిపిస్తుంది. అలాగే **Karl Marx Scientific Socialist** సిద్ధాంతాలతో కూడా ఈ రచయితకు మంచి పరిచయం ఉంది. అందుకే ''అంపశయ్య'' మీద వీటన్నిటి ప్రభావం కనిపిస్తుంది.

ఈ నవలలోని ప్రధానపాత్ర రవి. యూనివర్శిటీ క్యాంపస్‌లోని హాస్టల్లో ఉంటూ ఎం.ఏ. చదువుతుంటాడు - రవి గొప్ప భావుకుడు - ప్రతిచిన్న తాకిడికి కూడా అతని మనస్సు తీవ్రంగా స్పందిస్తూ ఉంటుంది. అతనిలో ఎప్పుడూ ఎడతెగకుండా ఆలోచనలు ప్రవాహంలా వస్తుంటాయి. ఈ ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టాలనో లేక అణగతొక్కేయాలనో అతడు ప్రయత్నిస్తుంటాడు. కానీ అతడు ఎంత అణగతొక్కాలని ప్రయత్నిస్తాడో అతని ఆలోచనలు అంత ఉధృతంగా అతన్ని ఆక్రమించుకుంటూ ఉంటాయి.

మార్చినెల వచ్చేసింది. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. ఇంత వరకు రవి చదవడం మొదలు పెట్టనేలేదు. అందుకే రవిలో వ్యాకులత, టెన్షన్ ప్రారంభమయ్యాయి. ఇలాంటి సందర్భాల్లో **"Obsessive"** మనస్తత్వం ఉన్న చాలామంది విద్యార్థుల్లో రవిలోలాగానే ఎంతకూ ఒక కొలిక్కి రాని అర్థ రహితమైన వ్యర్థ ఆలోచనలు ఉప్పెనలా రావడం సహజమే - **Abnormal Psychology** లో సూచించబడిన **Psychopathology** ని నవీన్ ఈ విధంగా వ్యక్త పరచారు.

ఈ నవలలోని మరో పాత్ర ఆచారి. ఇతనికి భగవంతుని మీద ఎంతో నమ్మకం. ఏదో ఒకదానిమీద నమ్మకం పెట్టుకోకుండా బతకడం సాధ్యంకాదని అతని విశ్వాసం. రవికేమో ఇలాంటి నమ్మకాలు లేవు. ఈ రెండు పాత్రల మనస్తత్వాలని నవీన్ **Jullian Rofter** సూచించిన రెండు విభిన్న మనస్తత్వాల సూత్రాన్ని దృష్టిలో పెట్టుకొని చిత్రించారనిపిస్తుంది. ఈ విభిన్న మూర్తిమత్వం ఉన్నవాళ్ళను **"External locus of Control"** ఉన్న వాళ్ళనీ, **Internal locus of control** ఉన్నవాళ్ళనీ రెండు వర్గాలుగా **Rofter** విభజించాడు. మొదటి కోవకు చెందిన మనుష్యులకు తమ పైన, తమ సామర్థ్యంపైన నమ్మకముండదు. వాళ్ళు దేవుడు, అదృష్టం, అనుకూల పరిస్థితులే తమ విజయానికి కారణమని నమ్ముతారు. రెండవ కోవకు చెందిన మనుష్యులేమో విజయం అనేది తమ మీదనే, తమ సామర్థ్యం మీదనే, తమ కఠోర పరిశ్రమ మీదనే ఆధారపడి ఉంటుందని నమ్ముతారు. ఈ నవలలోని ఆచారి

ప్రొఫెసర్ నిరంజన్ రెడ్డి, ప్రొఫెసర్ ఇన్ క్లినికల్ సైకాలజి, హైదరాబాదు.

మొదటి కోవకు చెందినవాడైతే, రవి రెండవ కోవకు చెందినవాడు. అయితే నవల చివర్లో ఆచారి తను ఊహించుకున్నంత దృఢచిత్తుడుగాని, స్వచ్ఛమైనవాడు కూడా కాదనీ, తనలో ఉన్న బలహీనతలే అతనిలో కూడా ఉన్నాయని రవి తెలుసుకోవడం ఈ నవలలో పెద్ద మలుపు. మనుష్యుల బాహ్యరూపానికి, అంతరంగ రూపానికి ఎంతో వ్యత్యాసముంటుందని కూడా నవీన్ ఆచారి పాత్ర ద్వారా రుజువు చేశాడు.

'అంపశయ్య' నవల తెల్లవారకట్ట రవి కంటున్న కలలతో ప్రారంభమౌతుంది. అస్తవ్యస్తంగా ఉన్న దృశ్యాలు, ఒకదానికీ, ఇంకొకదానికీ సంబంధం లేకుండా 'రవి మస్తిష్కంలో' కలల రూపంలో వస్తూ పోతూ ఉంటాయి. శిఖరాలు, అగాధాలు, కొండచిలువలూ, నదీ ప్రవాహం ఇవన్నీ రవి కలల్లో కదిలిపోతుంటాయి. ఈ సందర్భంలో నవీన్ ఫ్రాయిడ్ **"Psychology of Dream", "Dream work"** లాంటి సిద్ధాంతాల ద్వారా రవి మానసిక స్థితిని అద్భుతంగా చిత్రించాడు.

ఫ్రాయిడ్ వివరించిన స్వప్న సిద్ధాంతం ప్రకారం మనిషిలోని అచేతనావస్థ **(Unconscious)** చేతనావస్థలోకి **(Conscious State of Mind)** ప్రవేశించడానికి ప్రయత్నిస్తుంటుంది. కానీ రెంటికీ మధ్య **censor** అనేది పెద్ద అడ్డుగోడలా నిలుస్తుంది. ఎందకంటే అచేతనావస్థలో ఉన్న ఆలోచనలు, కోరికలు, సమస్యలు కొండొక కాలంలో చేతనావస్థలో ఉన్నటువంటివే. వాటిని సభ్య సమాజం అంగీకరించదన్న భయంవల్ల ( దీన్నే 'సెన్సార్' అంటారు) వాటి ఉనికి మనిషికి వ్యాకులతాభరితంగా మారుతుంది. కనుకనే అవి అచేతనంలోకి నెట్టివేయబడ్డాయి. దీన్నే ఫ్రాయిడ్ దమనం **(Repression)** అంటాడు. అయితే మనిషి నిద్రపోతున్నప్పుడు అతనిలోని సెన్సార్ అనే యంత్రాంగం బలహీనపడ్తుంది. సెన్సార్ షిప్ అనేది బలహీనపడటం వల్ల అచేతనంలో అణిచివేయబడ్డ ఎన్నో ఆలోచనలు, దృశ్యాలు, కోరికలు కలల రూపంలో చేతనలోకి ప్రవేశిస్తాయి. అయితే నిద్రపోతున్నప్పటి పూర్తి స్థితిని పూర్తి చేతనావస్థ అనడానికి వీల్లేదు - అందుకే నిద్రపోతున్నప్పటి స్థితిని ఉపచేతనా స్థితి లేక **"Sub conscious state of mind"** అంటాడు ఫ్రాయిడ్. ఈ ఉపచేతనా స్థితిని విశ్లేషించడం ద్వారా - అంటే కలల్ని విశ్లేషించడం ద్వారా అచేతనంలో ఏముందో తెలుసుకోవడానికి వీలౌతుంది. అందుకే ఫ్రాయిడ్ **"Dreams are royal road to unconscious"** అన్నాడు. అయితే అచేతనం కలల రూపంలో బయటపడే ముందు **"Condensation", "Symbolisation"** లాంటి ప్రక్రియలకు లోనవుతుంది. చేతనలో ఉండే సెన్సార్‌షిప్ కారణంగా ఇలా జరుగుతుంది. కలలో కనిపించే శిఖరాలు, అగాధాలు, కొండచిలువలు, నదీ ప్రవాహం మొదలైనవన్నీ కొన్ని మానసికావస్థలకు సంకేతాలు. **(Symbols)** కలల్లోని ఈ సంకేతాల్ని విశ్లేషించడం ద్వారా ఆ కలలుగంటున్న వ్యక్తి మనస్తత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా రవికి కలలో కనిపించిన శిఖరాలు అతడు చేరుకోవలసినగమ్యానికీ, లక్ష్యానికి సంకేతాలు. అవి ఎంత ఎత్తుగా ఉన్నాయంటే వాటిని చేరుకోవడానికి అతడెంతో శ్రమించాల్సి ఉంటుందనీ, కొండ చిలువలు పొంచి ఉన్న ప్రమాదాలకు సంకేతాలనీ, అగాధాలు తను తన లక్ష్యాన్ని సాధించలేనేమోననే భయానికి సంకేతాలనీ, నదీ ప్రవాహం అతని తల్లికి సంకేతమనీ అర్థం చేసుకోవలసి

ఉంటుంది - (కలల్లో కనిపించే నీళ్ళు తల్లికి సంకేతమని ఫ్రాయిడ్ భావించాడు) అలాగే కలలో రవి అందరిలాగే తనుకూడా రత్తి పైకి రాయి విసరడం అతనిలోని అపరాధ భావనకి సంకేతం. సమస్యని ధైర్యంగా ఎదురుక్కోకుండా నైతికంగా పతనమైపోయి, గుంపులో గోవిందయ్యగా మారి పోతున్నానని రవి తననుతాను శిక్షించుకోవడం కూడా ఈ కలలో రవి రత్తిమీద రాయి వేయడం సూచిస్తుంది.

ఈ కలలోనే రవికి వాళ్ళమ్మకూడా కనిపిస్తుంది. కానీ ఆమె అతనితో మాట్లాడటం లేదు. అతన్నెంతో ప్రేమించే వాళ్ళమ్మ అతనితో మాట్లాడకుండా ఉండిపోవడం రవిని షాక్ చేస్తుంది. ఈ కల ద్వారా నవీన్ మానసిక విశ్లేషణలోని ఓ ముఖ్యాంశాన్ని బహిర్గతం చేశాడు.

మనిషి వ్యక్తిత్వంలో మూడు అరలుంటాయని ఫ్రాయిడ్ తన మానసిక విశ్లేషణా సిద్ధాంతంలో రుజువు చేశాడు. ఆ మూడు అరల్ని **Id, Ego, Super Ego** గా పేర్కొంటారు. ఇందులో **Super Ego** లో నైతికత ముఖ్య భాగాన్ని ఆక్రమించుకుంటుంది. **Super Ego** అంటే అంతరాత్మ అని చెప్పొచ్చు. ఇది మనిషిని నీతి, నిజాయితి, బాధ్యత, మంచి నడవడిక లాంటి మార్గాల్లో నడిపించటానికి ప్రయత్నిస్తుంటుంది. రవికి కలలో కనిపించిన వాళ్ళమ్మ అతని **Super Ego** కు సంకేతం. తాను పరీక్షలు దగ్గరపడ్తున్నా సరిగ్గా చదవకుండా భవిష్యత్తును నిర్లక్ష్యం చేస్తున్నందుకు అమ్మ తనతో మాట్లాడకుండా తనను శిక్షిస్తోందని రవి అంతరంగంలో బలంగా నాటుకుంది. అదే ఈ కల రూపంలో బయటపడింది.

'అంపశయ్య' **Adoloscent** ప్రవర్తనను ప్రధాన అంశంగా తీసుకొని రాయబడింది. ఈ **Adoloscent** లేక ఆరంభ యౌవన దశ మొత్తం ఎదుగుదల దశల్లోనే అత్యంత కీలకమైన దశ అని **Developmental Psychologists** నిర్ధారించారు. ఈ వయస్సులో ఉన్నవాళ్ళు చాలా **Impulsive** గా... అంటే వివేచన కంటే ఆవేశమే వీళ్ళను నడిపిస్తుందనీ, కోరికల్ని అదుపులో పెట్టుకునే స్థితి వీళ్ళల్లో చాలా తక్కువగా ఉంటుందనీ, అందుకే పరీక్షఫీజుకనో, మెస్సుబిల్లు చెల్లించడం కోసమో తల్లిదండ్రులు పంపించిన డబ్బును సినిమాలమీదనో, హోటళ్ళమీదనో వీళ్ళు ఖర్చుపెడ్తుంటారనీ మనం గమనించవచ్చు.

ఈ వయస్సులో కొంతమంది తమను గూర్చి తాము తెలుసుకోలేరు. ''నేను ఎవరు? నా గమ్యం ఏమిటి?'' అనే ప్రశ్నలకు వీళ్ళ దగ్గర సమాధానం ఉండదు. ''ఎరిక్‌సన్'' అనే మానసిక శాస్త్రజ్ఞుడు ఇలాంటి క్లిష్ట పరిస్థితిని **"Identity V/s Role Confusion"** అంటాడు. **Role Confusion** - అంటే ఈ లోకంలో తన పాత్ర ఏమిటో తెలీకపోవడం వల్ల యువకులు **"Identity Crisis"** అనే మానసిక క్లేశంతో బాధపడ్తారని ఎరిక్‌సన్ అంటాడు. ఈ **Identity V/s Role Confusion** ని రవిలోనూ, అతని మిత్రబృందంలోనూ మనం గమనించవచ్చు. అందుకే వారు దారం తెగిన గాలిపటంలా సాగిపోతుంటారు.

ఈ వయస్సులో ఉన్న విద్యార్థులు కేవలం ఒంపు సొంపులను చూసి లేదా తమకు నచ్చిన ఏదో ఒక

అంశాన్ని... అంటే Single Characterstic ను చూసి ప్రేమలో పడిపోతుంటారు. దీన్ని ప్రేమ అనడం కంటే భ్రమ అనడం సబబుగా ఉంటుంది. లేక దీన్ని ప్రేమ కాదు మోహం... Infatuation అనొచ్చు. రవికి కిరణ్మయి మీద ఏర్పడిన ప్రేమ ఇలాంటిదే. రవి కేవలం కిరణ్మయి బాహ్య రూపాన్ని చూసే ఆమె ప్రేమలో పడ్డాడు. ఆమె ఎంతో సౌందర్యవతి అనుకొని ఆమె సౌందర్యాన్ని ఆరాధించడం మొదలెడ్తాడు - కానీ ఆ సౌందర్యమంతా రవి హృదయంలో ఉన్నదే. కిరణ్మయి దగ్గరౌతున్న కొద్దీ ఆమె ఆలోచనావిధానం, ఆమె జీవన విధానం తన ఆలోచనా విధానానికి, తన జీవన విధానానికి పూర్తిగా భిన్నం అని తెలుసుకుంటాడు. ఆమె attitudes తన attitudes ఉత్తర దక్షిణ ధృవాలని కూడా తెలుసుకుంటాడు. అందుకే ఆమె దగ్గరౌతున్న కొద్దీ దూరం అవుతున్నట్టుగా రవికి అనిపించింది. ఆరంభ యౌవనంలో ఉన్న వాళ్ళల్లో ఇది సాధారణంగా జరిగే సంఘటనే.

గోడలపైన రాతల్ని "Graffiti" అంటారు. ముఖ్యంగా బూతు graffiti ని మనం కాలేజి గోడల పైన, మూత్రశాలల్లో, టాయ్‌లెట్స్‌లో గమనిస్తుంటాం. ఈ విధంగా గోడలపైన ఎందుకు రాస్తారు అన్న ప్రశ్నకు మానసిక శాస్త్రవేత్తలు సమాధానం చెప్పారు. బాల్య దశలో ఉన్న పిల్లల రాతలు ఒక విధంగా ఉంటాయి. వాళ్ళు చదువుకునే చదువే చిన్నపిల్లల రాతల్లో కనిపిస్తుంది. అదే ఆరంభ యౌవనంలో ఉన్నవాళ్లు రాసే రాతల్లో సెక్స్ ఎక్కువగా ఉంటుంది. కారణం ఈ వయస్సులో ఉన్నవాళ్ళల్లో సెక్స్ పరమైన కోరికలు ఎక్కువగా ఉండటమే - అలా రాయడం ద్వారా ఆ కోరికలు కొంతవరకు తీరినట్టనిపిస్తాయి - 'అంపశయ్య'లో ఇలాంటి 'graffiti' మనకు కనిపిస్తుంది. అలాగే ఈ నవలలో అదే పనిగా తాళం వెయ్యడం - తీయడం, స్విఛాఫ్ చెయ్యడం - ఆన్‌చెయ్యడం లాంటి యువకులు చేసే పనుల్ని వాళ్ళల్లోని లైంగిక అశాంతికి సంకేతాలుగా చెప్పొచ్చు. ఉధృతంగా చెలరేగుతున్న సెక్స్ కోరికల్ని అణిచివేసుకోవడం, వాటిని ఈ రూపంలో తీర్చుకోవడం ఈ వయస్సులో ఉన్న వాళ్ళల్లో జరుగుతుంటుంది. ఒక్కొక్కసారి ఈ లైంగిక అశాంతి వికృత రూపాన్ని కూడా ధరించవచ్చు. అందుకు ఉదాహరణగా ఈ నవలలోని గుర్నాధాన్ని చూపించవచ్చు. గుర్నాధం "Homo Sexual" అన్న సూచన ఈ నవలలో ఉంది.

మనిషి అనుక్షణం తన Ego ను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు. జీవితంలో అతడు ఎదుర్కొనే ఓటమి, ఎదుటి వ్యక్తులు అతనిమీద చేసే విమర్శ మొదలైనవి అతని అహాన్ని.... అంటే Ego ను దెబ్బ తీస్తాయి. ఇలాంటి సందర్భాలే Ego devaluation కు దారితీస్తాయి. అలా కాకుండా ఉండటానికి అతనిలోని Ego ను కాపాడుకునే యంత్రాంగం ఎప్పుడూ పనిచేస్తుంటుంది. దీన్నే "Ego Defensive Mechanism" అంటారు. ఈ నవలలో రవి, అతని మిత్ర బృందం ''మనం ఎంత చదివినా ఏం లాభం. మనకసలు ఫస్ట్ క్లాస్ వస్తుందా? ఒకవేళ వచ్చినా మనం చెయ్యబోయేది L.D.C. ఉద్యోగమే కదా. అందుకే కష్టపడి చదవడం షేర్ వేస్ట్ అందుకే జల్సాగా తిరగడమే బెటర్'' అనుకుంటారు. దీన్ని "Rationalisation" అనే Ego Defence Mechanism అని చెప్పొచ్చు. నా సమస్యకు నేను బాధ్యున్ని కాను. సమాజమే బాధ్యత వహించాలి. నాకు ఫస్ట్‌క్లాస్ రాకపోవడానికి

మా ప్రొఫెసర్ మా కులం వాడు కాకపోవడమే కారణం గానీ నేను చదవకపోవడం కారణం కాదు... రవి కొన్నిసార్లు ఈ ధోరణిలో ఆలోచిస్తాడు. ఇది **Projection** అనబడే **Ego Defence Mechanism**కి ఉదాహరణ. విద్యార్థుల్లో తరచుగా కనిపించే ఈ **Ego Defensive Mechanism** ని 'అంపశయ్య' లో నవీన్ చక్కగా చిత్రించారు.

ఈ నవలలో రత్తి పాత్ర పాఠకుల మీద బలమైన ముద్రవేస్తుంది. రత్తి నిప్పులాంటి మనిషి. శీలాన్ని కాపాడుకోవాలి అనే విలువను గౌరవించే మనిషి. తన శీలాన్ని కాపాడుకోవడానికి గోవిందరావునూ, మిగతావాళ్ళనూ ఎదిరించి పోరాడింది. కానీ అందరూ శీలమా? పాడా? దాన్ని కాపాడుకోవడమేమిటి? అన్నట్టుగా ప్రవర్తించడంతో రత్తి సంఘర్షణకు గురవుతుంది. గోవిందరావు ఆమెమీద మరింత వొత్తిడి తీసుకురావడంతో మెల్లగా రత్తిలో **"Cognitive Dissonance"** ప్రారంభమౌతుంది. అంటే మనం నమ్మిన **Value** సరికాదు - అది అబద్ధం, అర్థంలేనిది అనుకున్నప్పుడు మనసులో అలజడి చెలరేగుతుంది. తీవ్రమైన సంఘర్షణ ప్రారంభమౌతుంది. అప్పుడు పాత ఆలోచనలు మారి కొత్త ఆలోచనలు వస్తాయి. పాత **Value** లేక విలువ మారి కొత్త విలువ దాని స్థానాన్ని ఆక్రమించుకుంటుంది. రత్తిలో ఈ మార్పు జరుగుతుంది. ఆమె శీలం కాపాడుకోవాలన్న విలువకు తిలోదకాలిస్తుంది. దాంతో ఆమె ప్రవర్తనలో మార్పు వస్తుంది. కానీ రత్తిలోని **Super Ego...** అంటే ఆమె అంతరాత్మ ఆమెను క్షమించదు. ఆమెలో అపరాధ భావం చెలరేగుతుంది. అందుకే ఆమె తనను తాను శిక్షించుకుంటుంది. డబ్బుకు శరీరాన్ని అమ్ముకుంటుంది. ఆమె తనమీది కసితో తన శరీరపు రేటును ''అఠణా'' నుంచి ''చారాణా'' కు ( అర్థ నుండి పావలాకు) తగ్గిస్తుంది.

ఇప్పుడు **Pavlov** (పావలోవ్) సూచించిన **Conditioned Reflexes Theory** ప్రకారం 'అంపశయ్య' లోని ఒక సంఘటనని విశ్లేషిద్దాం.

భయాన్ని రేకెత్తించే **Stimulus**తో ఏదైనా ఒక **Neutral Stimulus** ను జోడిస్తే, **Neutral Stimulus** కు కూడా మొదటి **Stimulus** లక్షణాలే వస్తాయి. అంటే ఇది కూడా భయాన్ని రేకెత్తిస్తుంది. ఇదీ క్లుప్తంగా పావలోవ్ సూచించిన **Conditioned Reflex Theory.**

ఈ నవలలో రవికి గుర్నాథం అంటే విపరీతమైన అయిష్టత.. జుగుప్స. అతడో కంపు మనిషనే ఆలోచన రవి మనసులో పాతుకుపోయింది. కానీ గుర్నాథం దగ్గరకు వెళ్ళక తప్పదు. ఆ రోజు లేవగానే రవికి టూత్ పేస్టు అవసరమౌతుంది. అతని దగ్గరున్న టూత్ పేస్టు అయిపోయింది. - ఎంత వత్తినా దాంట్లోంచి టూత్ పేస్టు రావడంలేదు - అప్పుడు రవికి గుర్నాథాన్ని ఆశ్రయించక తప్పదు. గుర్నాథం రూంకెళ్ళి అతని టూత్ పేస్టు తెచ్చుకుంటాడు. కానీ గుర్నాథం మీదున్న జుగుప్స కారణంగా అతని టూత్ పేస్ట్‌మీద కూడా రవికి జుగుప్స కల్గుతుంది. గుర్నాథం దగ్గరకొచ్చినప్పుడు కొట్టే కంపు అతని టూత్ పేస్ట్‌లో కూడా కొడ్తున్నట్టు రవికనిపిస్తుంది.

ఇలా 'అంపశయ్య' లో అడుగడుగునా నవీన్ విద్యార్థుల జీవనశైలిని, ఆలోచనా ధోరణుల్ని వివిధ మానసిక శాస్త్ర కోణాల్లోంచి విశ్లేషించినట్టుగా మనకర్థమౌతుంది. వాటిల్లో కొన్నింటిని మాత్రమే నేనీ వ్యాసంలో విశ్లేషించగల్గాను. వ్యాస విస్తరణ భీతివల్ల ఇంకెన్నో అంశాల్ని వదిలేశాను.

# కాలగర్భంలో కలిసిపోయిన రష్యన్ ఆత్మ పునరావిష్కారం

## (1933వ సం॥ నోబెల్ సాహిత్య బహుమతి పురస్కార స్వీకారోపన్యాసము)

మూలం: ఇవాన్ బునిన్ అనువాదం: – సి.ఎల్.ఎల్. జయప్రద

ఇక్కడ నుండి చాలా దూరంలో ఒక చిన్న ఊరులో ఒక పురాతనమైన భవనంలో నేను ఉన్నప్పుడు స్వీడిష్ అకాడమీ ఈ నిర్ణయం గురించి తెలిపే టెలిఫోను వచ్చింది. ఇది నా జీవితంలో మహత్తరమైన రోజని నేను అందరిలాగా చెప్తే అది సత్యదూరం అవుతుంది. ఒక గొప్ప తత్త్వజ్ఞాని అన్నట్లు జీవితంలో అత్యంత ఆనందకరమైన క్షణాలు విషాదకరమైన అనుభూతులతో ఎప్పుడూ సరితూగలేవు. నేనెప్పటికీ మరచిపోలేని ఈ విందు సమయంలో మీకు విచారకరమైన విషయాలు చెప్పటం నా ఉద్దేశం కాదు, కానీ గత పదిహేను సంవత్సరాలలో నా జీవితంలో సంతోషం కంటే దుఃఖమే ఎక్కువ. ఆ దుఃఖం నా వ్యక్తిగత జీవితం గురించి ఎంత మాత్రం కాదు. అయితే ఒక విషయం మాత్రం నేను ఇక్కడ గట్టిగా చెప్పగలను. స్టాక్‌హోమ్ నుండి వచ్చిన ఈ టెలిఫోను, ఈ వైజ్ఞానిక అద్భుతం ఇచ్చినంత సంతోషం, సకారణమైన సంతృప్తి ఇన్నేళ్ళ నా సాహిత్య జీవితంలో మరేదీ ఇవ్వలేదు. మీ దేశపు మహానుభావుడు ఆల్‌ఫ్రెడ్ నోబెల్ స్థాపించిన ఈ పురస్కారం ఈనాటికీ ఒక రచయితకు గొప్ప గౌరవం సమకూర్చేది. ఆశలకు అతీతుడిని కాని నేను పక్షపాత రహితులు, నిష్ణాతులు అయిన న్యాయనిర్ణేతల చేతుల మీదుగా ఈ బహుమతి అందుకుంటానికి గర్వపడుతున్నాను. ఇందుకు అకాడమీ గౌరవ సభ్యులకు కృతజ్ఞుణ్ణి. శుభ సమాచారం అందుకున్న ఆ నవంబరు తొమ్మిదిన నాగురించి మాత్రమే నేను ఆలోచించి ఉంటే నేనొక స్వార్థపరుణ్ణి అయి ఉండేవాణ్ణి. అభినందనల టెలిగ్రాములు ఒకవైపు నన్ను ముంచి వేస్తుంటే ఒక ఒంటరి రాత్రి నిశ్శబ్దంగా నేను స్వీడిష్ అకాడమీ నిర్ణయం వెనకున్న గూడార్థమేమిటని ఆలోచించాను. ఈ బహుమతి స్థాపించిన తరువాత మొదటిసారిగా మీరు దీనిని ఒక దేశ బహిష్కృతుడికి ఇచ్చారు. నేను నా స్వదేశం నుండి వెళ్ళగొట్టబడి ప్రస్తుతం ఫ్రాన్సులో తలదాచుకున్న వాడిని, వారికి ఋణబద్ధుడైన వాడిని. నా వ్యక్తిగత వివరాలు, రచనలూ ప్రక్కన పెట్టినా, మీ ఈ నిర్ణయం ఎంతో సౌందర్యపూరితమైంది. ఈ నాటి ప్రపంచంలో సంపూర్తిగా స్వతంత్రంగా వ్యవహరించగల సంస్థల అవసరం ఎంతో ఉంది. ఈ సంస్థలోని సభ్యుల్లో అన్ని రకాలైన తత్త్వపరమైన, మతపరమైన భేధాభిప్రాయాలున్న వారున్నారు. కానీ మనందరినీ ఒక్కతాటి మీదకు చేర్చే సత్యం మాత్రం స్వతంత్ర నిర్ణయాధికారం, అంతఃకరణం. ఈ సత్యంమ్మీదే మన నాగరికత ఆధారపడి ఉంది. మరీ ముఖ్యంగా రచయితలనే వారికి ఈ స్వతంత్రమే పిడివాదమూ, ప్రత్యక్షసత్యమూ కూడా. అకాడమీ సభ్యులారా మీ ఈ నిర్ణయం, స్వేచ్ఛని ప్రేమించే తత్త్వమే స్వీడన్‌లో జాతీయ లక్షణమని మరొక సారి నిరూపించింది.

మరి కొన్ని మాటలు నేను ఇప్పుడు తప్పక చెప్పాలి. మీ రాజ కుటుంబం, మీ దేశం, మీ ప్రజలు, మీ సాహిత్యం పైన నాకున్న అభిమానం ఈరోజు కొత్తగా పుట్టింది కాదు. సాహిత్యం పైన, విద్యపైన

సి. ఎల్. ఎల్. జయప్రద, వాల్తేరు, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంగ్ల శాఖలో రీడర్‌గా పని చేస్తున్నారు.

అభిమానం మీరాజ కుటుంబంలో, మీదేశంలో తరతరాలుగా వస్తున్నదే. ఒక శౌర్యుడైన సైనికుడు స్థాపించిన మీ రాజ వంశం ప్రపంచమంతటిలో ఎంతో ఘనతకెక్కినది. ఉదారులైన ప్రజలను పాలించే ఉన్నతుడైన మీ మహారాజు పట్ల స్వీడిష్ అకాడమీ గౌరవించిన ఒక అనామకుడూ, స్వతంత్రుడూ అయిన ఈ రచయత యొక్క గాఢమైన ప్రేమా, గొప్ప గౌరవ భావాలను వెలిబుచ్చనివ్వండి.

రచయత పురస్కార స్వీకార ఉపన్యాసం ముందు కరోలిన్ సంస్థలో పని చేసే ఆచార్యులు ప్రొఫెసర్ విల్‌హెల్మ్ నార్టవ్‌సెన్ అన్న మాటలివి: ''ఈ రోజు సూక్ష్మాతి సూక్ష్మమైన అణువులను, క్రోమోజోములను పరిశోధించే ప్రయత్నాలనే కాక మానవ అంతరంగంలో సునిశిత లక్షణాలను వర్ణించే ప్రయత్నాలను కూడా నోబెల్ పురస్కారమనే రజత కిరీటం అలంకరించింది. బునిన్ కాలగర్భంలో కలసి పోయిన రష్యా దేశపు ఆత్మని పరిశోధించి, ఉన్నత పరిమాణాలు పరంపరగా మోసుకు వస్తున్న పేరు పొందిన రష్యా సాహిత్య ప్రమాణాలను కొనసాగించారు. ఒకప్పటి మీ దేశ సమాజపు విలువైన రూపం మా కళ్ళ ముందుంచి, అది మీ కళ్ల ముందే పతన మవుతుంటే మీరనుభవించే బాధ మేమర్థం చేసుకునేలా చేశారు. విషాదకరమైన దేశ బహిష్కారంలో మా సానుభూతి మీకు ఊరట కల్గించాలని కోరుకుంటున్నాము.

## సమర్పణ

### *స్వీడిష్ అకాడమీ శాశ్విత కార్యదర్శి హోల్‌స్ట్రామ్*

ఇవాన్ బునిన్ సాహిత్య జీవితం ఏ చిక్కులూ లేకుండా నిర్మలంగా ఉన్నది. ఒక జమిందారుల వంశంలో ఈయన జన్మించారు. సమకాలీన సాహిత్య సాంప్రదాయంలో ఆ వర్గం రష్యన్ సాహిత్యాన్ని ఏలుతూ, ఆకాలపు ఐరోపాలో విశిష్టమైన సాహిత్యాన్ని సృష్టించి గొప్ప రాజకీయ ఉద్యమాలకు కారణభూతమైంది. చిన్న రైతుల పట్ల సానుభూతితో ఆవేశంగావారి బానిసత్వానికి ఎదురు తిరిగిన వీరిని నిర్మలమైన అంతఃకరణానికి రారాజులంటూ తరువాత కాలం వర్ణించింది. తమ రచనలతో ప్రభావితం చేసిన రాజకీయ ఉద్యమాలకు సర్వసంపదలను పణంగా తరువాత కాలంలో పెట్టవలసి వచ్చిన వీరు తప్పకుండా ఇంకా మంచి బిరుదుకీ అర్హులు.

చిన్న వయస్సులో బునిన్ చుట్టూ క్షీణించిన కుటుంబ సంపద మాత్రమే పడి ఉండగా, కవిత్వ లోకంలో మాత్రమే ఆయన తన ముందు తరాల వారితో పూర్తి అనుబంధాన్ని అనుభవించగలిగారు. జాతీయ భావం, భవిష్యత్తుపై ఆశలున్న దానిలో కాక ఒక శక్తి హీనమైన భ్రాంతుల ప్రపంచంలో ఆయన జీవించారు. అయినా ఆయనపైన ఆనాటి సంస్కరణ ఉద్యమాల ప్రభావం కన్పిస్తుంది. పేదవారిపై, పామర జనంపై టాల్‌స్టాయ్ చూపిన సోదరభావం బునిన్‌పై బలమైన ముద్ర వేసింది. ఆయన శారీరక శ్రమతో బ్రతకటం నేర్చుకుని ఒక సహృదయుడి ఇంటిలో చాలా శ్రమతో కూడిన పీపాలు తయారు చేసే పనిలో కుదిరాడు. అక్కడ వారి మధ్య తరచూ చర్చలు జరుగుతుండేవి.

భౌతిక వ్యామోహాల మీద పోరాడి ఓడిపోతూఉండే మరో ఆయన బునిన్‌కు మత విషయాలలో

గురువుగా దొరికాడు. బునిన్ ఆయన దగ్గరే శాఖాహారిగా మారాడు. వారిద్దరూ కలిసి టాల్‌స్టాయ్‌ని కలవటానికి చేసిన యాత్రలో బునిన్ ఆయన ఓటములను, జయాలనూ దగ్గరగా చూశాడు. రైలు స్టేషన్లలో ఎన్ని రకాల ఫలహారాలు చూసినా చలించని ఆయన ఒక చోట కైమా ఉండలు చూడగానే ఆశపడ్డాడు. అవి తినటం పూర్తి కాగానే తన వ్యామోహానికి ఆయన రకరకాల కారణాలు వర్ణించాడు, తాను కైమా ఉండలకి బానిసను కానే కానని, కావాల్సినప్పుడు తినటానికి లేనప్పుడు మానటానికి తనకి తగిన నిగ్రహం ఉందనీ వగైరా. ఆయన యువ శిష్యుడు ఆయనను వదలటానికి ఎక్కువ రోజులు పట్టలేదు.

టాల్ స్టాయ్ కూడా బునిన్ యొక్క మత పరమైన ఉత్సాహానికి ఎక్కువ గుర్తింపు ఇవ్వలేదు. ''నువ్వు సాదాసీదాగా శారీరక శ్రమపై ఆధారపడి జీవించాలనుకుంటున్నావా? మంచిదే దాని గురించి పెద్ద పొంగి పోవాల్సిన పనిలేదు. ఒక మనిషి ఏరకపు జీవితంలోనైనా ఉన్నతంగా బ్రతకచ్చు.'' కవి జీవితం గురించి కూడా టాల్‌స్టాయ్ ఇలా చెప్పారు. ''నీకు రాయాలనే తపన ఉంటే తప్పక రాస్తుండు, కానీ అది నీ జీవిత లక్ష్యం ఎప్పుడూ కాలేదు''. బునిన్ ఈ హెచ్చరికని పెద్దగా పట్టించుకోలేదు అప్పటికే ఆయన కవిత్వంతో తన జీవితాన్ని పూర్తిగా ముడి పెట్టేసుకున్నారు.

అతి త్వరలోనే ఆయన సాంప్రదాయ పద్ధతిలో రాసిన కవిత్వానికి మంచి పేరు వచ్చింది. వాటిలోని వస్తువు పూర్వపు జమీందార్ల భవనాలలో గత కాలపు వైభవాల విషాదపూరిత వర్ణన. అదే సమయంలో ప్రకృతిని నిశితంగా పరిశీలించి విశిష్టంగా తీర్చి దిద్దుకున్న తన వచన శైలిలో కళ్ళకు కట్టినట్లు వర్ణించగలిగారు. తన తరం రచయితలు కొత్త వరవడులైన సింబాలిజమ్, ఫ్యూచరిజం, ఆడమిజమ్‌లలో నైపుణ్యం సంపాదించగా తాను మాత్రం వాస్తవికతా వాదమువైపు మొగ్గి కాలానికి ఎదురీదారు ఒంటరిగా.

బునిన్ నలభైవ ఏట వెలువడిన ఆయన నవల 'టెరిస్యా' ఆయనకి పేరు, ఒక విధంగా చెడ్డ పేరు కూడా తెచ్చి పెట్టింది. ఈ నవల పైన ఆవేశ పూరితమైన చర్చలు జరిగాయి. ఇందులో రష్యా సంస్కృతిలో చాలా ముఖ్యమైన బలవంతుడు నీతివంతుడైన స్లావ్ రైతు గురించిన కలని, ఈతని ద్వారా రష్యా ప్రపంచంలో ఉన్నతోన్నతమైన దేశం కాబోతున్నదనే తీయని ఊహని బునిన్ ప్రశ్నించారు. ఈయన చిన్న రైతుల గుణగణాల యదార్థ వర్ణనతో ఆ ఆదర్శమైన ఊహా రూపాన్ని ఖండించారు. ఫలితం రష్యన్ సాహిత్యంలో వాస్తవబింబాలు తరచూ కన్పించేవే అయినా, వాటిని మించి క్రూరమైన, చీకటి ప్రపంచాన్ని చూపించే రచనలు.

రచయిత తన నవల్లోని ముఖ్య పాత్రలు అమానవీయంగా మారటానికి దారి తీసిన పరిస్థితుల్ని వివరించడు, ఆ పాత్రల తాతని క్రూరమైన యజమాని కుక్కలతో తరిమి చంపించాడని తప్ప. ఆ అకృత్యం పీడింపబడే మనష్యుల మనస్సులో చెరగని గాయాలెలావుంటాయో తెలుపుతుంది. వాస్తవికతకు రంగులు వేయకుండా నిర్భయంగా చిత్రీకరించిన తన నిజాయతీని నిరూపించుకోవటం బునిన్‌కి సులభమే. ఎందుకంటే అంతకు ముందే ఆ ప్రాంతంలో మొదటి విప్లవంలో భాగంగా రాబోయే విప్లవానికి సంకేతంగా ఘోరమైన హింసాత్మక సంఘటనలు జరిగాయి.

మరొక పేరు దొరక్క అనువాద నవల అని పిలచిన ఈ పుస్తకంలో బడుగు జీవితాల్లో జరిగిన కదలించి వేసే సంఘటనలు కన్పిస్తాయి. ఇక్కడ రచయిత ముఖ్యోద్దేశం వాస్తవానికి రూపం ఇవ్వటమే, విమర్శకుడి దృష్టిలో ఈ వర్ణనలుకాక వాటి ఎంపిక పెద్ద దోషమైంది. బయట దేశస్తు లెవ్వరూ ఈ విమర్శలో నిజమెంతో న్నిర్ణయించలేరు. ఈ పుస్తకం తరువాత కాలంలో అప్పుడు జరుగుతున్న చరిత్ర మూలంగా ప్రసిద్ధి చెందింది. వలస వెళ్ళిన రష్యన్ల దృష్టి లోనూ, దేశంలోనే ఉన్న వారి దృష్టిలోనూ ఈ నవల దానిలోని లోతు, గాఢత, కళాత్మకరూపం వలన ఒకగొప్ప కావ్యమైంది.

పల్లెల వర్ణన తరువాత బునిన్ రాసిన ఎన్నో వ్యాసాల్లో ముందుకు సాగి చిన్న రైతుని ఉత్సాహంతో ఉరకలేస్తున్న జాతీయవాదుల దృష్టిలో దేశానికి వెన్నెముకగా గుర్తింప చేసాయి. బునిన్ నిష్పక్షపాతమైన రచనల్లో ప్రపంచానికి విముక్తి కలిగించే దైవత్వం అరాజకమైన శక్తులుగా, తమను తామే కించ పరచుకునే లక్షణంగా దిగ జారిందని, అదే రష్యన్ల అసలు తత్త్వం అనీ విశిదీకరించారు. యవ్వనారంభంలో ఆయన టాల్‌స్టాయ్ లాగా ప్రపంచాన్ని చూసిన దృష్టి తరువాత పూర్తిగా మారింది. ఆయనలో మారకుండా మిగిలింది రష్యా భూమిపై ఆయన కున్న ప్రేమ. పల్లెపట్టులను ఈ చిన్న నవలల్లో వర్ణించినంత అద్భుతంగా ఆయన మరెక్కడా వర్ణించలేదు. ప్రపంచంలోని మోసాలు, వికృతత్త్వం చూసిం తరువాత బునిన్ ఈ రచనలు తనను తాను కాపాడు కోవటానికీ, మరోసారి స్వేచ్ఛగా గాలి పీల్చుకోవటానికి చేసాడనిపిస్తుంది.

వేరే ధృక్కోణం నుండి రాసిన 'సుకోడల్' (1911-12), కోటలో జీవితం గురించి రాసిన చిన్న నవల 'టెరిస్యా' కు జంట నవలగా రచయిత రాసాడనుకోవచ్చు. ఇందులో సమకాలీన జీవితం గురించి కాక తాను పెరిగిన కోటలోని ఒకప్పుటి వైభవమైన జీవితం గురించి ఒక పరిచారిక జ్ఞాపకాల ద్వారా చెప్తాడు. ఇందులో బునిన్ ఆశావాదిగా కన్పించరు. ఈయన చూపించిన జమిందారులు శక్తి హీనులు, వారి జీవితాలకిగానీ, వారిపై ఆధారుపడి జీవించే రైతుల జీవితాలకిగాని బాధ్యత వహించేంత తెలివికూడా లేనివాళ్ళు, 'టెరిస్యా' లో చెప్పకుండా వదిలేసిన వాళ్ళ జీవితాల గురించి ఆయన ఈ నవలలో చెప్పాడని అన్పిస్తుంది.

కవిత్వంతో నిండిన దృశ్యకావ్యం ఇది. ఇందుకు కొంత కారణం కాలచక్రానికి తలవొగ్గినగతకాలం పడే రాజీ, మరికొంత ఈ కథ చెప్పిన స్త్రీ ఆర్ధ్ర దృష్టితో తన యవ్వనాన్ని నాశనం చేసిన గందరగోళ పరిస్థితుల్ని, మారుతున్న ప్రపంచాన్ని వర్ణించిన తీరు. ముఖ్యంగా ఈ పుస్తకంలో కవిత్వానికి మూలం రచయిత మేధాశక్తి, కల్పనాశక్తి. 'సుకోడల్' చాలా గొప్ప సాహిత్య సృష్టి.

ప్రపంచయుద్ధానికి ముందు బునిన్ మధ్యధరా దేశాలకు, తూర్పుదేశాలకూ ఎన్నో యాత్రలు చేశాడు. హిందూతత్త్వంతో ఆకర్షింపబడి భోగ జీవిత పరిత్యాగంలో ఉన్న శాంతి గురించి కొన్ని సార్లు, మరి కొన్ని సార్లు పాశ్చాత్య దేశాల్లోని భౌతిక వాదాన్ని, తూర్పు దేశాలలోని అవాస్తవిక ధోరణులను పోల్చి చూపాడు. యుద్ధానంతరం ఈ ఆలోచనలన్నీ విషాదంతో నిండి 'గాస్పోడిన్ సాన్ ఫ్రాన్సిస్కో' **(The Gentleman of Francisco)** లో కన్పిస్తాయి.

ఇక్కడ కూడ మిగిలిన నవలల్లో లాగే బునిన్ తన వస్తువుని లోతైన పాత్రల ద్వారా కాక సాధారణ పాత్రల ద్వారా సులభంగా వ్యక్తీకరించటానికి ప్రయత్నించాడు. ఆయన ఈ పద్ధతిని ఎంచుకోవటానికి ఒక కారణముంది. పాత్రలను తాను లోతుగా పరిశీలించటానికి ప్రయత్నిస్తే అవితన చిన్నచూపుకి, ద్వేషానికి గురి అవుతాయేమోనని సందేహించినట్లుంది. రచయిత దృష్టి ఇక్కడ అత్యంత ధనవంతుడైన అమెరికా వ్యాపారవేత్తపై అతడు జీవితాంతం డబ్బు కోసం ప్రాకులాడి, ముసలి వయస్సులో ప్రపంచ యాత్రకు బయలుదేరి, తన అధికారం, రాటుతేలి పోయిన తన ఆత్మ, ఇంకా ఆనందాల కోసం వెదుక్కునే తత్త్వం గురించి తెలుసుకుని చివరకు పేలిపోయే బుడగలా చనిపోవటం వరకు మాత్రం వుంటుంది. జాలిలేని విధే ఆపాత్రపై తన తీర్పు చెప్పినట్లనిపిస్తుంది. రచయిత నిష్పక్షపాతంగా, నిరామయంగా చాలా చిన్న మనిషిపై అతని ప్రధాన శత్రువు, పట్టు సడలని విధి జరిపే పోరాటాన్ని మనిషి కోరికలపై ప్రకృతి శక్తులు జరిపే పోరాటంగా వర్ణిస్తాడు. కాకపోతే పాఠకుల్లో మాత్రం ఈ నవల చదివినప్పుడు మిస్టిజం జనించి, బునిన్ శైలి వలన మరింత పెరుగుతుంది. 'గాస్పోడిన్ ఇజ్ ఫ్రాన్సిస్కో' అందరూ గొప్ప కావ్యంగా అంగీకరించిన పుస్తకం. ప్రపంచాన్ని అలుముకోబోతున్న సంధ్య చీకట్లని ఇది చూపిస్తుంది. విషాదానికి దారి తీసే మానవ అపరాధాల్ని ఖండించి, ప్రపంచాన్ని విషాదపుటంచులకు నెట్టివేసిన, వక్రంగా మారిన మానవ సంస్కృతిని ఎత్తి చూపుతుంది.

ఆయనెంతో ప్రేమించిన దేశం ప్రపంచ యుద్ధం తరువాత ఆయన్ని బహిష్కరిస్తే బాధలుపడ్డా ఆయన మౌనంగానే ఉన్నారు. దూరమైన దేశం ఆయనకు మరింత ప్రియమై, గత జ్ఞాపకాలు ఆయనకి మనషులపై మరింత కరుణ కలిగించాయి. అయినా ఆయన రష్యన్ రైతు తప్పిదాలని అడపాదడపా స్పష్టంగానే చిత్రించారు. భవిష్యత్తుపై దృష్టి సారించినప్పుడు ఆయనకు ఆరైతుల అవలక్షణాలన్నిటి వెనక నాశనం లేని మానవీయత కన్పించగా, దీనిని నీతి సూత్రాల్లాగా కాకుండా ప్రకృతిలో భవిష్యత్తుకు బాటలేసుకునే శక్తిగా చిత్రిస్తాడు.

ఇలా రష్యన్ గతంలోని ఆణిముత్యాల నుండి ఆయన మళ్ళీ మళ్ళీ స్ఫూర్తి పొందారు. రష్యా భవిష్యత్తుపై బునిన్ బంగారు కలలు కని తన కాలపు రోజుల వాస్తవిక దృక్పథానికి దగ్గరగా ఉండేలా వాటికి ఒక రంగుల రూపం ఇచ్చారు. **'Mityo's Love'** లో యవ్వనంలోని భావాలకు మనస్తత్వ విశ్లేషణ చేసి ఇంద్రియానుభూతులతో, వివిధ భావనలతో చిత్రించిన తీరు అద్భుతంగా ఉంటుంది. అప్పట్లో కనుమరుగవుతున్న కొన్ని సాహిత్య సాంప్రదాయాలను మరల వెలికి తీసుకువచ్చిన ఈ పుస్తకం రష్యాలో చాలా పేరు పొందింది. ఆయన జీవిత చరిత్రను కొంత వరకు ప్రతి ఫలింప చేసే **'The well of Days'** లో రష్యన్ జీవితాన్ని చాలా విస్తృతంగా చిత్రించి పల్లె జీవితాల చిత్రకారుడిగా రష్యన్ సాహిత్యంలో అంతకు ముందే ఆయన సంపాదించుకున్న స్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నారు.

దేశ సాహిత్య చరిత్రలో ఆయన స్థానం తిరుగులేనిదిగా అందరూ గుర్తించారు. బునిన్ 19వ శతాబ్దపు సాహిత్య పరంపరలోని ముందుకు సాగిపోగలగిన అంశాలని మాత్రమే అనుసరించారు. చిక్కని శైలిలో, వివరణలు, వైరుధ్యాన్ని చిత్రించటంలో ఆయన నిష్ణాతులైనారు. ఒక విలక్షణమైన

పరిశీలనా శక్తి ఆయన చేసే వాస్తవిక వర్ణనల్లో కన్పిస్తుంది. తానొక కవి అయి ఉండి కూడా అత్యంత నిగ్రహంతో ఆయన మాటల మాయాశక్తికి లొంగి పోలేదు. తాను చూసిన విషయాల్ని వర్ణనలతో మెరుగు పెట్టలేదు. సాదాసీదాగా అన్పించే ఆయన శైలిలో ఆకర్షణ ఆయన పుస్తకాల అనువాదాలలో కూడా వచ్చిందని సమకాలీన రచయితల అభిప్రాయం. అదే ఆయనలోని విశేషమైన విషయం, ఆయన రచనలను మహాకావ్యంగా తీర్చిదిద్దే అంశం.

బునిన్ మహాశయా ! నేను మీ రచనలను, వాటికి గొప్పతనాన్ని చేకూర్చే మీ శైలిలోని నిరాడంబరతను వర్ణించటానికి చేసిన ఈ ప్రయత్నం కాలాభావం చేత అసంపూర్తిగానే మిగిలి పోయింది. దయ చేసి మా మహారాజుగారి నుండి ఈ విశిష్టమైన నోబెల్ పురస్కారాన్ని, దానితో పాటు మా శుభాకాంక్షలని స్వీకరించండి.

**జీవిత చరిత్ర**

రాజకీయాలలోను, కళలలోనూ ప్రసిద్ధికెక్కిన వ్యక్తులను రష్యాకి సమర్పించిన పురాతనమైన జమిందారీ వంశంనాది. వారిలో పందొమ్మిదవ శతాబ్దంలో జీవించిన అన్నా బునీనా, అతనీస్ బునిన్ టర్కిష్ సల్మాల కుమారుడు వాసలీ జుకోవస్కీ సాహిత్యచరిత్రలో పేరు మోసిన వారు.

నా పూర్వీకులందరూ భూమితోనూ, సామాన్య జనంతోనూ దగ్గర సంబంధం కలవారే. నా తల్లి దండ్రులూ ఆ కోవకే చెందుతారు. మాస్కోలోని రాజులను టార్ టార్ దండ యాత్రల నుండి రక్షించటానికి రష్యాలోని అన్ని ప్రాంతాల రాజ కుటుంబాల వారు వలస వచ్చి మధ్య రష్యాలోని సారవంతమైన ప్రాంతంలో నివసించ సాగారు. మాకూ అక్కడే ఎస్టేట్లు ఉండేవి. ఆ ప్రాంతంలో రష్యా భాషల్లోని విలువైన మాండలీకం వికసించటం, టర్జనేవ్ నుండి టాల్‌స్టాయ్ వరకు గల గొప్ప రష్యన్ రచయితలు ఆ ప్రాంతం నుండే రావటం జరిగింది.

వారానిజ్‌లో 1870లో పుట్టిననేను నా బాల్యం, యవ్వనమంతా పల్లె పట్టునా తండ్రి ఎస్టేట్లలోనే గడపటం జరిగింది. నేను యవ్వనంలోకి అడుగిడుతున్నప్పుడు జరిగిన నా సోదరి మరణం నన్ను పూర్తిగా కలచివేసి నా నమ్మకాలలో కల్లోలం రేపినా అది నా ఆత్మపైన చెరగని గాయం చెయ్యలేదు. చిత్రకళంటే అప్పటి నుండి నాకున్న గాఢమైన ప్రేమ నా రచనల్లో కూడా కన్పిస్తుందనుకుంటాను. కవిత్వం, వచనం నేను ఆ రోజుల నుండే రాయటం, అవి ప్రచురింపబడటం జరిగింది.

నేను రాయటం మొదలుపెట్టిన నుండినా పుస్తకాలు కవిత్వంలోనూ, వచనంలోనూ వచ్చినాయి. ఇంగ్లీషు నుండి నేను చేసిన అనువాదాలు కూడా వెలువడ్డాయి. ప్రక్రియల ప్రకారం నా రచనలను విడదీస్తే అందులో అనేక కవిత్వ సంకలనాలూ, రెండు అనువాద సంకలనాలూ, పది వచన సంకలనాలూ కన్పిస్తాయి.

కొద్ది కాలానికేనా రచనలు విమర్శకుల నుండిగుర్తింపు పొందాయి. తరువాత ఎన్నో బహుమతులు, రష్యాలో అత్యున్నతమైన పుష్కిన్ సాహిత్య పురస్కారం రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సు నుండి

అందుకున్నాను. పేరు ప్రతిష్టల్లో ఫ్రెంచ్ అకాడమీకి సరి సమానమైన ఆ అకాడమీ 1909లో నన్ను దాని పన్నెండు మంది గౌరవ సభ్యుల్లో ఒకరిగా ఎన్నుకుంది. వారిలో మరొకరు టాల్‌స్టాయ్.

అయినా నేను చాలా కాలం వరకు ఎవరికీ తెలియక పోవటానికి కారణాలున్నాయి. అవి నేను రాజకీయాలకు దూరంగా ఉండటం, నా రచనల్లో అందుకు సంబంధించిన ప్రశ్నలేవీ చర్చించకపోవటం, నేను కాల్పనిక, ప్రతీకాత్మక, క్షీణ లేక సహజ వాదాలు వేటికీ చెందక పోవటం. పల్లె ప్రాంతాల్లో ఎక్కువగా జీవించిన నేను రష్యాలోనూ, పైదేశాల్లోనూ విరివిగా ప్రయాణం చేశాను. ఇటలీ, సిసిలీ, టర్కీ, బాల్కన్ దేశాలూ, సిరియా, పాలెస్టీన్, ఈజిప్టు ఇంకామరికొన్ని ఉష్ణ దేశాలూ తిరిగి చూశాను. నేను ప్రపంచాన్ని పరిశీలించి దానిపై నా ఆత్మ ముద్ర వదలటానికి ప్రయత్నించానని సాదీ అన్నారు. తత్త్వ, మత, నీతి, చరిత్రకు సంబంధించిన విషయాలన్నిటిలోనూ నాకు ఆసక్తి ఉంది.

1910లో నేను ప్రచురించిన నవల 'డెరెస్యా' (The Village), ఒక రష్యా దేశస్తుని పై పూతలు లేకుండా చూపించిన రచనల్లో నా మొదటి ప్రయత్నం. అతడి నడత, ఆత్మ, సహజ స్వభావం, వెలుగులోనూ, చీకట్లోనూ ఉన్న అతని పునాదుల యొక్క మూలాలు, వీటన్నిటిలోనూ కలసి ఉన్న విషాదం తేట తెల్లంగా చూపించాను. రష్యన్ సాహిత్య రంగంలో ఈ కనికరం లేని రచనలు పండితుల మధ్య ఆవేశపూరితమైన చర్చలకు దారి తీసాయి. ఈ విమర్శకులు, పండితులు కొన్నిసార్లు సాంఘిక పరిస్థితులవల్ల, కొన్నిసార్లు అజ్ఞానమో లేక రాజకీయ వత్తిడుల వల్లో ప్రజలను నిరంతరంగా ఆదర్శప్రాయులుగా చిత్రించారు. నిజం చెప్పాలంటే నా రచనలవల్ల నేను చెడ్డ పేరు తెచ్చుకున్నాను. ఆ పేరు ఈ మధ్య వచ్చిన నారచనల వల్ల మరింత పెరిగింది.

1918లో బోల్షివిక్కుల నిరంకుశ పరిపాలన వల్ల నేను మాస్కో వదలాల్సి వచ్చింది. ఫిబ్రవరి 1920లో విదేశాలకు వలస పోయేవరకూ నేను దక్షిణ రష్యాలో జీవించాను. అప్పటి నుండి ఫ్రాన్సులోని పారిస్‌కు సముద్ర తీరాన ఉన్న ఆల్ప్ పర్వతాల మధ్య తిరుగుతూ కాలం గడుపుతున్నాను.

**ఇవాన్ బునిన్ జీవిత వివరాలు**

బునిన్ (1870-1953) 'డెరెస్యా' కాక 'సుకోడల్' (1911-12), 'మిటినాల్యుబోవ్' (1924-25), (Mitya's Love), కథ ''సాన్ ఫ్రాన్సిస్కో పెద్ద మనుష్యులు'', ఆత్మకథ నవలగా రూపొందించిన 'జెజిన్ ఆర్సినోవా' (The well of Daysగా ఇంగ్లీషులోకి అనువదించారు) రాశారు. కవిత్వ ధోరణిలో రాసిన ఎన్నో కథా సంకలనాలు కాక ఆయన జ్ఞాపకాలు, చిత్తరువులు (Memories and portraits) పేరున ఆత్మకథ ప్రచురించారు. 1953లో ఫ్రాన్సులో ఆయన మరణించారు. ఆయన రచనలన్నీ కలిసి వచ్చిన సంకలనాలు బెర్లిన్ నుండి పన్నెండు (1934-36), మాస్కో నుండి ఆరు (1956), కథా సంకలనాలు (మాస్కో 1961), కవితా సంకలనాలు (లెనిన్ గ్రాడ్, 1961) వెలువడ్డాయి.

# కవిత్వానికి కంచె

మూలం: జయంత మహాపాత్ర అనువాదం : డా॥ యు. ఏ. నరసింహమూర్తి

మన దైనందిన జీవన స్థితి, జీవన సంక్లిష్టత, జీవిత పరమార్థం వీటి అంతస్సారాన్ని జీర్ణించుకుని కవిత్వం మనలో చైతన్యాన్ని కలిగిస్తుందని అనుకుంటే - దాని ప్రభావం మన ఆచరణల మీద, రాజకీయ చర్యల మీద కూడా ఉంటూందా? ఈ రోజు నాకు నేను వేసుకోదలచిన ప్రశ్న ఇది. ఈ భావన చాలా పురాతనమైనదని ప్రతివాడూ నొక్కి చెప్పవచ్చును. మన చర్యలు సాంఘికమైనవైనా, రాజకీయమైనవైనా వాటి మీద కవిత్వపు అంతిమ ప్రభావం తప్పనిసరిగా ఉంటుందనే సత్యాన్ని ఎవరూ కాదనలేరు. కవిత్వం నిజంగా రాజకీయాలను ప్రభావితం చేయగలిగితే కవిత్వమే రాజకీయమని మనం చెప్పవచ్చును. అలా అయితే ఈ కవిత్వం కవిత్వమే కాదు. కేవలం పనికిరాని డొల్ల అనవలసి వస్తుంది.

జీవితం ఒక సింహావలోకనం; కాబట్టి కవిత్వమూ సింహావలోకనమే. మనకు వారసత్వంగా సంక్రమించి, మన అంతరాంతరాల్లోకి చొచ్చుకుని పోయిన ఈ జ్ఞాపకం, ఈ భయంకర సమాధి మనవెప్పటికీ ఒంటరిగా విడచిపెట్టదు. అప్పుడు - నోరు లేకుండానే ఆక్రందించే ఆ శిశువు ఎవరు? ఆ రోదన ఎందుకు? అని కవి ప్రశ్నించుకుంటాడు. దానితోపాటు బీద - గొప్ప అనే నిరంతర సమీకరణం, దివారాత్రాల విశ్లేష సందిగ్ధత, యుద్ధము - శాంతి కవిత్వం వీటిని పరిష్కరించగలదా? ప్రపంచాన్ని ఎప్పటికైనా మార్చగలదా? లోకపు నడతల్ని ఒక పాటగా మలచ గలదా?

ఇండియన్ ఇంగ్లీషు కవిత్వంతోను, ఒరియా, బెంగాలీ, అస్సామీ కవిత్వాలతోను నాకు కొంచెం పరిచయం ఉంది. ఈ కవుల్లో చాలామంది తమకు తాముగా కల్పించుకున్న లోకాల్లో బందీలుగా ఉంటారు. అక్కడ కొన్ని భ్రాంతుల్ని సృష్టించుకుంటూ ఉంటారు. తమ నియమబద్ధ జీవితంలో ఒక ఆధిక్యాన్ని చూసుకుంటారు. తమ కవిత్వం నిర్నిరోధమైన దనుకుంటారు. మనసా వాచా కర్మణా మార్పును నిరోధించాలన్నది వారి ఆంతరికమైన వాంఛ. వారు సందిగ్ధ ఆత్మరతిలో ఊగు లాడుతూ ఉంటారు. స్వార్థవలయాల్లో భ్రమిస్తూ ఉంటారు. స్వ - పర, ఆంతర - బాహిర, వ్యక్తిగత - సామాజికత మధ్య నుండే సంబంధాన్ని విప్పి చెప్పే స్వచ్ఛమైన కవితాపథం నుండి తొలగిపోతారు. ఆధునిక కళాకారులలోని సందిగ్ధతను ఆకళింపు చేసుకున్న జాన్ బెర్గర్ ''పాబ్లో పికాసో విజయం - వైఫల్యం'' **(The Success and Failure of Pablo Picaso)** అన్న వ్యాసంలో ఈ మాటలంటాడు. '' ఆ కళాకారులు కనుచూపు సోకనంత దూరంలో ఉంటారు. అందుకే అనేకమంది ప్రజలు దిలాసాగా తమ సొంత పద్ధతులలోని వైరుధ్యాల నుండి రక్షణ పొందతూ ఉంటారు. ఆ నికర వైరుధ్యాల నుండే అభివృద్ధి అంతా వచ్చిందనాలి.''

మన కవులనేకులు అధికారుల - విద్యాధికుల ప్రపంచంలో మునిగి తేలే వారు. వాళ్లు కళాకారుణ్ణి అలౌకిక సీమలకు తరలించుకుని పోతారు. అక్కడ తనకు ఇతరులకు మధ్యనుండే సంబంధాలన్నీ తిరస్కరింపబడతాయి. భాష సాంఘిక సంబంధాల నుండి విడిపోతుంది ఏకాంత యవని కాభ్యంతరంలో ఉన్న ఈ మన కళాకారుణ్ణి, ఈ మన కవిని మనం ఆరాధిస్తాం. అతడి ఊహాలోకాల నన్నింటిలోని సరాసరి దేవుని నుండి పొందిన దివ్య వారసత్వంగా భావించి ఆమోదిస్తాం. వ్యక్తికి

---

డా॥ యు. ఏ. నరసింహమూర్తి, విజయనగరం, మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షులుగా ఉన్నారు.

ప్రపంచానికి మధ్య తార్కిక సంబంధంగాని, చారిత్రిక సంబంధంగాని లేదన్నట్లుగా చూస్తాం. నిజమైన సామాజిక స్పృహగాని, శ్రోతృసమాజంగాని లేకుండానే అప్పుడు మనము రాస్తున్నామన్న సంగతి మనకు తెలుస్తుంది.

భారత దేశాన్ని వదలి ఉద్దేశపూర్వకంగా ఇతర దేశాలకు ప్రవాసం పోయిన, ఇంగ్లీషులో రాసే భారతీయులనేకుల కవిత్వం బహుశా ఈ కారణం చేతనే విఫలమై ఉంటుంది. అటువంటి కవి మనిషిగా మరీ ఒంటరి. కాని ఈ ఒంటరితనం వల్ల అతని కళకు ఒరిగేదేముంది? తాను వదలి పెట్టి వచ్చిన దేశం మీద తనకున్న అచ్చమైన కోరికల నన్నింటినీ అల్లుకోవడం మొదలుపెడతాడు. తనను పెంచి పెద్ద చేసిన విలువలనన్నింటినీ ప్రోత్సహిస్తూ, మద్దత్తునిస్తూ రాయడం ప్రారంభిస్తాడు. ఆ తర్వాత నిశ్చయంగా అతనికో కథా ఇతివృత్తమూ అంటూ లేకుండా పోతుంది. అతని ఆవేశాలు, అనుభూతులు చల్లారక పోవచ్చును. కాని వస్తువు కోసం కాళ్లా చేతులా తన్నుకోవడం అతనికి తప్పదని ప్రతి ఒక్కడూ అనుకుంటాడు.

లాటిన్ అమెరికా, తూర్పు ఐరోపా దేశాలకు చెందిన గొప్ప కవులు చరిత్ర పరిధిలో జీవిస్తారు. మన దేశంలోని ప్రాంతీయ భాషా కవులు కూడా అంతే. వారి ఊహలకు వారి ప్రగాఢ దార్శనికత నుండి ప్రాణస్పందన కలుగుతుంది. వీళ్లతో పోలిస్తే భారతీయ ఆంగ్ల కవిత్వం నిర్జీవంగా ఉంటుంది.

దానికి చరిత్ర - సంప్రదాయం అనే సాధనాలేమీ లేవు. అది పనికిమాలిన సాన్నిహిత్యాల ఊబిలో కూరుకుపోయింది. భారతీయ సాంస్కృతిక క్షేత్రం నుండి నా కవితా సస్యం మొలకెత్తాలని నిష్కపటంగా నేను వాంఛిస్తాను. అయినప్పటికీ వ్యక్తికీ - సమాజానికి మధ్య నుండే సంబంధాన్ని పెంచి పోషించడం ఏమంత తేలికైన పనిగా కనిపించదు. ఆ సంబంధ స్థాపనలో అది నైతిక సంతులనాన్ని కోల్పోయిన కారణంగా, ఆత్మముఖీనమైన కొలపాత్రగా మారుతుందని అటువంటి కవిత్వాన్ని రాయడానికి భయపడతారు.

కలహండి ఆకలి నేలల్లో అప్పుడప్పుడు తిరుగాడే నాలో ఒక కవిత కదిలింది. బహుశా అది వ్యక్తికి సమాజానికి మధ్యనుండే సేతువు మీద నలిగిన ఆత్మముఖీనమైన అశాంతిలోంచి వ్యథ చెంది విడివడినట్లు కనిపిస్తుంది. దాని శీర్షిక ''ఒరిస్సాలో చావులు''.

ఉద్ధరించే శక్తి లేక చచ్చుబడ్డ
దేవుడు లోకమంతా చాపిన సహాయ హస్తానికి
చెట్ల కొమ్మల ముఖాలు దురంత వేదనలు
ఉరి పోసుకున్నాయి.
ఆహా ! నేను కుక్కలా మొరిగే కవిని
కిటికీని తెరవండి.
నేను ఊపిరితీసుకుంటాను
నా జ్ఞాపకం మాటువేసిన పులి కాకూడదు.
కాని అక్కడ ఈ భయంగొలిపే జాగృత కళేబరం వుంది
దాన్నొక లాఠీయో కత్తో మాత్రమే ముక్కలుగా చీల్చగలదు.

ఇదొక మంచి పద్యం కాకపోవచ్చును. కాని ఇది నా అనుభవంలోంచి వచ్చింది. ఇది నిజాయితీ నిండిన ప్రయత్నం. ఇక్కడ నేను వివరించదలచుకున్న విషయం ఒకటుంది. ఆలోచించడానికి నన్ను నేను సమర్థించుకున్న తీరు నుండి ఈ పద్యం పుట్టింది. ఇలియట్ సాధారణంగా కవినెప్పుడూ ఆలోచకుడుగా అంగీకరించ లేదు. అతని 'ప్రాజ్ఞత ఈ ధోరణిని ధిక్కరించింది, పరిత్యజించింది. ''షేక్స్పియర్‌గాని, డాంటేగాని ఎప్పుడూ నిజంగా ఆలోచించలేదు. అది వాళ్లపనికాదు'' అన్నాడాయన. కవిలో ఆలోచన కనిపించిందంటే అది సమకాలీన ఆలోచనా ధోరణుల ప్రతిరూపమైన ఉద్వేగమే కాని వేరొకటి కాదు. ఈ ఆలోచనా ధోరణులు ఒకగొప్ప తాత్త్విక భూమికలో భాగాలుగా ఉన్నాయా? లేదా? అన్న సంగతి కవిత్వాని కక్కరలేదు.

అవి సార్వకాలిక - సార్వజనీన ప్రేరణలతో నిండి ఉన్నాయా? లేదా? అన్నదే కవిత్వానికి కావాలి. అంతేకాదు. ప్రపంచానుభవంలోని విభిన్నత్వాన్ని తనకనువైన మార్గంలో అభివ్యక్తం చేసే స్వేచ్ఛ కూడా కావాలి. తన జ్ఞానము - తీర్పు ఆధారంగా తప్పొప్పులు నిర్ణయించగలగాలి. కవి తన అంతరాత్మకు బాధ్యత వహించగలిగి ఉండాలి. సామాజిక చర్యకు కవిత్వానికి గల సంబంధాన్ని గుర్తించడం కష్టం. బహుశా ఇది ఇంతవరకు గుర్తింపబడలేదు. కాబట్టి ఆ సంబంధాన్ని నిర్వచించలేము. కాని ఒకటి మాత్రం నిజం. ఇంతవరకు చూసిన దానిని బట్టి మన ఉద్రేకాలను కవిత్వం ప్రభావితం చేస్తూంది. అంచేత దాని ఫలితం ఏదో మన శీలం మీద ఉంది. కవిత్వం వల్ల కలిగే ఆ ఫలితం ఎంత? ఏ మేరకు? అనేది గజానన్ మాధవ్ ముక్తిబోధ్ లాంటి వాళ్లు చెప్పాలి.

కవిత్వానికి తీర్పునిచ్చే హక్కు ఉంది. ఇలా అనడానికి తనకు హక్కుందని ప్రతివాడూ అనుకుంటాడు. ఓటర్లైన జనసామాన్యపు ఆదరాభిమానాలను మూటగట్టుకోవాలని దిగజారుడుతనంతో ప్రాకులాడే రాజకీయ నాయకుల మార్గాలు తీర్పునిచ్చే మన హక్కుని పెంచిపోషిస్తున్నాయని ప్రతి ఒక్కడూ తీర్మానించుకుంటాడు. ఇది ప్రత్యక్షంగా జరుగుతుంది. మన ప్రజా ప్రతినిధులు ఔరంగజేబు చక్రవర్తిలా ఆలోచించవచ్చును; అలాంటి వాళ్లమని అనుకోవచ్చును. కాని ప్రజాసందోహాల సమక్షంలో ఆయనలా మాట్లాడగలిగినవాడు వాళ్లలో ఒకడు కూడా లేడు.

కవులు బహుశా రాజకీయ క్రీడను బయటనుండి గమనిస్తారు. కవులుగా ఉన్నంతసేపూ మనం ప్రేక్షకులమే, ఆటగాళ్లం కాము. బయటనుండి చూచినా, ఆటగాళ్ల కళ్లకు మసగ్గా కనిపించే దృశ్యాలన్నీ కవులకు స్పష్టంగానే కనిపిస్తాయి. అయినా కొన్ని మార్గాల్లో ఆ దృష్టి చెదరుతుంది. అప్పుడు ప్రేక్షకుడైన మన కవి సులభంగా ఆ క్రీడాకారులపట్ల ఒక దిగజారుడు ధోరణిని ఊహించుకుంటాడు. వాళ్లను తిరస్కరించడానికి మొగ్గు చూపుతాడు.

నైతిక స్వచ్ఛతకు సంరక్షకులంగా, ఎవరూ కోరకుండానే, మనకు మనంగా ముందుకు వస్తాము. సామాజిక విషయాలలో మాత్రం ప్రత్యక్షంగా పాల్గోము. కవులుగా మనం ఎదుర్కొనే గొప్ప ప్రమాద మిదే. నేను రాజకీయాలు భ్రష్టుపట్టి పోయాయంటాను, ప్రభుత్వమే అవినీతి అంటాను, ప్రభుత్వమే ఒక మోసం అంటాను. కాని కవిగా నేను మాత్రం స్వచ్ఛంగా, గౌరవప్రదంగా ఉన్నానంటాను. రాజకీయాల కంటె గొప్ప పనులెన్నో ఉన్నాయి నాకు. కుట్రలు నడపడానికి, వ్యూహాలు పన్నడానికి నాకు తీరిక లేదు. రాజకీయాలు గొప్ప పనుల నుండి నా దృష్టి చెదరేటట్లు మాత్రమే చేయగలవు. ఆ

గొప్పపనులు చేసే మహనీయుల మార్గం నుండి తొలగించగలవు. చివరకు నామీదనింత బురద చల్లితే చల్లగలవు; రక్తాన్ని చిందిస్తే చిందించగలవు.

కవి దేశ లేదా సాంఘిక నీతికి సమర్థకుణ్ణనే విశ్వాసపు దుప్పట్లో దూరడం మానుకోవాలి. అది తప్పు. ఆ డాబు - దర్పం ఆడంబరానికి దారి తీస్తుంది. ఆ ఎదురుగాలి కవికి లక్ష్యమైన, నిజమైన, కవితా గమ్యాన్ని చేరనీయకుండా దారి మళ్లిస్తుంది. నా పద్యంలోని మూడు పంక్తులిలా ఉన్నాయి.

నా ప్రభుత్వం తన వాగ్దానాలనే క్షణంలోనైనా
అతిక్రమిస్తుంది.
నా పద్యంలోని ఒక చరణాన్ని
విశాలమైన, స్వచ్ఛమైన న్యూఢిల్లీ వీథులన్నిటా ఈడుస్తారు.

కవి నైతిక ప్రవర్తనకు సంరక్షకుడుగా నిలబడతాడన్న నా మాటకు ఇదొక ఉదాహరణం కావచ్చును. ఇలా చెప్తూనప్పుడు నాలో నాకొక ఛద్మ లక్షణం కనిపిస్తుంది. అది నన్నుకొంత బాధిస్తుంది. ఈ లక్షణం నాలోనే కాదు. ప్రజలకు ఏ బాధ కలిగినా ప్రభుత్వాలను విమర్శిస్తూ పోయే విద్యావంతులైన మధ్య తరగతి మేధావులందరిలోనూ వ్యాపించి వుంది. అయినా కాని కవిత్వం ఆ ఛద్మలక్షణాన్ని మనలో నిలపకపోతే బహుశా లోకాలు నిలువలేవు. కళలన్నింటిలోనూ కవిత్వానికే ఇది సాధ్యం. కవిత్వపు మూలం జీవం ఉన్న ప్రతి మానవుడిలోనూ ఉంది.

ఇక్కడ తప్పనిసరిగా చెప్పవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి. తన చుట్టూ ఏం జరుగుతూందో తెలుసుకోని కవి మృతప్రాయుడు. తన చుట్టూ ఉన్న వాస్తవాన్ని మాత్రమే చూసే కవికూడా మృతప్రాయుడే. కేవలం అసంగతత్వంతో తనకు, తన సన్నిహిత మిత్రులకు, తన ప్రియులకు మాత్రమే అర్థమయ్యేలా రాయడం చాలా విచారించదగ్గ విషయం. మూర్ఖులకు కూడా అర్థమయ్యేటంత తర్కబద్ధంగా రాయడం మరీ దారుణం. కవిత్వం అనుల్లంఘనీయమైన నియమాలకు కట్టుబడి ఉండేదికాదు. మంచి చెడుల పునాదుల మీద నిలిచి వుండేది కాదు. కవిత్వానికి క్షతిలేదు; ఓటమిలేదు.

చివరగా ఒక మాట. కవుల బాధ్యతల్ని గూర్చి ఆలోచించే బుద్ధికి రెండు ప్రత్యామ్నాయాలు కన్పిస్తున్నాయి. ''ఊహల్లో, కలల్లో తేలిపోయే మనిషి మీద ఇంతటి భారాన్ని మోపడం న్యాయమా? అన్న దొకటి. వైజ్ఞానికులు, తాత్త్వికులు, రాజనీతిజ్ఞులు వంటి ఇతర మేధావి వర్గం ఎవరి చేతనైనా ఈ విషయంలో పూచీకత్తు రాయించుకోకూడదా? అన్నది రెండవది.

కవిత్వం మనిషిలోని అగాధము - ఆంతరికము అయిన పిలుపు. అందులోంచి ఉపాసన, వేదాలు, ఉపనిషత్తులు, మతగ్రంథాలు వచ్చాయి. కవి ప్రకృతి సౌందర్యాన్ని ముఖాముఖిగా దర్శించేడు. అతడు ఆదిమ యుగాల ప్రకృతి పూజారిగా తన కవన వ్యాపారాన్ని సంరక్షించుకున్నాడు. అదేవిధంగా ఆధునిక కవి తన కవిత్వాన్ని సమర్థించు కోవడానికి ప్రజా సందోహాల గౌరవాభిమానాలను ఆమోదిస్తున్నాడు. సామాజిక స్పృహనిండిన నేటి సామాజిక కవి ఇప్పటికీ ఆదిమ పూజారుల అనువంశిక క్రమంలో సభ్యుడుగా కొనసాగుతున్నాడు. పాతరోజుల్లో కవి చీకటితో జట్టుకట్టేడు. ఇప్పటి కవి వెలుగును గూర్చి మాట్లాడక తప్పదు; వ్యాఖ్యానింపకా తప్పదు.

*(18-3-2001 నాటి హిందూ సౌజన్యంతో)*

# వైవస్వత మనువు రూపుదిద్దిన
# ఈజిప్టు - సప్తసింధు నాగరికతలు

(గత సంచిక తరువాయి)

- డా॥ ఎం.వి.ఎన్. కృష్ణారావు

**సప్తసింధు లిపి**

నేను 'సప్తసింధు' అనటానికి కారణం - ఈ పదంలో సింధు వాటి ఐదు పంచ ఉపనదులు, సర్వస్వతీ దాని ఉపనది దృషద్వతీ అన్నీ కలిసి వస్తాయి. ఈ నాగరికత ఆ సప్త నదీ లోయల్లోని పట్టణాలలోను అనేక వందల చిన్న నగరాల్లోను, గ్రామాల్లోనూ విస్తరించి వున్నది.

ఈ లిపిలో దాదాపు 400 సంకేతాలు వున్నవి. వాటిని వారు ప్రతినిత్యం వాడే వస్తువుల చిత్రాలకు దగ్గరి సంకేతాలుగా, ఆ వస్తువులు సూచించేవారి భాషలో వాడేపదాలకు శబ్ద సంకేతాలుగా నిర్ణయించారు. ఉదాహరణకు 'వ' అనే శబ్దానికి, ఆ శబ్దాన్ని సూచించే వర సంకేతమైన వటపత్రం  ; అలాగే వాజిన అన్న పద సంకేతం  కూడ 'వ' అనే శబ్దాన్ని ఇస్తుంది. అలాగే 'న' శబ్దాన్ని సూచించేందుకు ఆ శబ్ద సంకేతాన్ని సూచించే పదం 'నర' , 'నగ'  ఈ పద్ధతిని 'ప్రిన్స్‌పల్ ఆఫ్ ఆక్రోఫోనీ' అంటారు. మొదట్లో ఈజిప్షియన్లు, హిటైట్స్ ఈ పద్ధతిలో తమ లిపులను తయారు చేసుకున్నారు. ఈ పద్ధతిలో మొదట మొదట ఎవరికి వారు ఈ శబ్ద సంకేతాలను సూచించే చిత్ర సంకేతాలను ఎన్నుకోవటం వలన ఒకే 'శబ్దానికి' అనేకమైన సంకేతాలు వచ్చాయి. ఆ విధంగా శబ్ద సంకేతాల సంఖ్య 400 మించి పోయింది. తర్వాత దినాలల్లో వాటిని పరిమితంగా అందరూ వాడే సంకేతాలను మాత్రమే ప్రచారంలో వుంచారు. దానివలన సంకేతాల సంఖ్య పరిమితమైంది.

**డైరెక్షన్ ఆఫ్ రైటింగ్:** ఈ లిపిని మామూలుగా ముద్రికలలో (Sealings) లో కుడి నుండి ఎడమకు రాసేవారు. కాని అప్పుడప్పుడు ఎడమ నుండి కుడికి, పై నుండి క్రిందకు, చుట్టూతా కూడా వ్రాయడం జరిగింది.

**గుణింతాలు :** కొన్ని హల్లులకు బాగ ఎక్కువ వాడుకలో నున్న వాటిలోనే ఉదాహరణకు న, ని, ను అని గుణింతం వచ్చినప్పుడు, హల్లులోనే బ్రాహ్మీ లిపిలో మాదిరిగా నిలువు గీతలతో గుణింతాన్ని సూచించారు. 'నె' గుణింతాన్ని సూచించటానికి హల్లుకు ప్రక్కనె ... అచ్చును పెట్టారు. అంతగా ఎక్కువగా వాడుకలో లేని హల్లులకు గుణింతాలు సూచించలేదు. వాడుకను సందర్భాన్ని బట్టి పాఠకుడు గుణింతాన్ని ఊహించుకొని చదువుకోవాలి. ఉదాహరణకు: వరుణ రాయాలంటే వరణ రాశేవారు. సందర్భాన్ని బట్టి ఆ మాటను 'వరుణ' అని కాని వరేణ అని కాని చదవవచ్చు. ఈ పద్ధతిని బాబిలోనియన్లు, ఈజిప్షియన్లు కూడ పాటించారు.

**సంయుక్తాక్షరాలు :** (కాంపోసిట్ సైన్స్) మరియు (మోనోగ్రామ్స్) రెండు, మూడు హల్లులను, అచ్చులను కలిపి ఒకే సంకేతంగా వాడారు. వీటిని సాధారణంగా పట్టణాల పేర్లను, దేవుళ్ళ పేర్లను తెలియచెయ్యటానికి మాత్రమే ఉపయోగించేవారు.

---

డా॥ యమ్. వి. యన్. కృష్ణారావు భారత పురాతత్వ సర్వే శిక్షణా శాఖలో డిప్యూటి సూపరిండెంట్, ఆర్కియాలజిస్టుగా పనిచేసి 1988లో రిటైరైనారు. హైదరాబాదులో ఉండి ఇంకా సింధు లిపి పై పరిశోధన కొనసాగిస్తున్నారు.

**భావ సంకేతాలు:** ( ఐడియోగ్రామ్స్) వీటిని కూడ దేవుళ్ళ పేర్లను, వారు చేసే పనులను, వాటి గుణాలను బట్టి సూచించేవారు. ఇంకా రాయటం ద్వారా తెలియచెయ్యలేని భావాలను సూచించెందుకు వాడేవారు. ఉదాహరణకు, ఒక పేరు రాసి అది పిల్లవాడి పేరు అని తెలియచెప్పటానికి ఒక చిన్న  మొలకను మాటపక్కనో, మధ్యనో ఉంచేవారు. అలాగే ఒకపట్టణం పేరు రాసి అది పట్టణం అని తెలియ చెయ్యటానికి పక్కన ఒకగుర్తు పెట్టేవారు. ( ఇలా ). అలా చెయ్యకపోతే ఆ పేరు దేవుడిపేరు అని పాఠకుడు పొరబడవచ్చు.

## నిర్ధారక సంకేతాలు (డిటర్మినెటివ్స్):

ఒక మనిషి పేరు వ్రాసి అది ఒక మనిషి పేరు అని చెప్పటానికి, పక్కనే ఒక మనిషి బొమ్మను వ్రాసేవారు. సూర్యుడిపేరు ఒకటి వ్రాసి (సూర్యుడికి ఎన్నో పేర్లున్నాయి) ఆ పేరు మధ్యలోనో, చివరనో దేవుడి బొమ్మను గీసేవారు. అంటే అది సూర్యుడి పేరన్న మాట. అలాగే ఇంకో దేవుడు వాయు దేవుని పేరు 'పవ' అని వ్రాసి ప్రక్కన  ఇలాంటి చేతితో ఒక దండం భుజాన పెట్టుకున్న బొమ్మను గీసేవారు. అంటే ఆ దేవుడు శిక్షించే గుణం కల్గినవాడు.

**శబ్దార్థాలను పూర్తి చేసే సంకేతాలు:** (ఫొనెటిక్ కాంప్లిమెంట్స్) పైన 'పవ' అని వ్రాసి పక్కన  శిక్షించే దేవుడి బొమ్మను వేస్తే, ఆ దేవుడి గుణం తెలుస్తుంది. 'పవ' లాంటి శిక్షించే గుణం వున్న దేవుళ్లు చాలమంది వున్నారు. ఉదాహరణకు: నిన, వర, వన.. 'పవ ' అని రాసినప్పుడు పూర్తిగా రాయకుండనే 'ప ' రాస్తే అది 'పవ' అవుతుంది. 'వ'  రాస్తే అది 'వర్గ' అవుతుంది. ఆ పద్ధతినే ఫొనెటిక్ కాంప్లిమెంట్ అంటారు.

**క్లుప్త సంకేతాలు:** (అబ్రీవియేషన్స్) ఒకసారి ఎక్కడో అక్కడ పూర్తి మాట, పేరు, వ్రాసాక రెండోసారి అదేమాటను తెలియచేయాలంటే 'సంకేతాన్ని' నిలువు గీతల మధ్య బంధించేవాళ్ళు. ఉదాహరణకు 'దమన' ఎప్పుడూ వచ్చే పేరు చివర భాగం దాన్ని ఒక ':ద:' సంకేతంతో ఇలా చూపటం.

**సప్తసింధు భాష:** దీనికి 'భస' అని పేరు పెట్టారు. ఎందుకంటే మొట్టమొదటి (మొహెంజోదారోలో) రాజధాని అయిన 'భస' లేక 'వస' అనే పట్టణం నుంచి వారి భాష, లిపి, మిగతా పట్టణాలకు వ్యాపించింది. ఈ మొట్టమొదటి ఆర్యుల వలస వేదకాలపు ఆర్యుల వలసకంటే దాదాపు వేయి సంవత్సరాల ముందే, దిగువ సింధు నదీ తీరాల్లో ప్రారంభమయింది. మను (నార్మెర్) 'వస' ను సప్తసింధు ఉత్తర ప్రాంతాన్ని జయించటానికి ముందే, ఈ ప్రాంతాన్ని జయించాడు. సప్తసింధులో అన్ని జాతుల ప్రజలు నివసిస్తున్నా ఆర్యుల ప్రభావం ఎక్కువగానే వుండేది. అందువలనే వారి భాషనే రాజభాషగా తీసుకున్నారు. అప్పటికి వ్రాయడంలో సంధులు వాడేవారు కాదు. హల్లు అచ్చు కలిపిన శబ్దాలను విడివిడిగా ఉచ్చరించేవారు. అలాగే రాసేవారు. వైదిక సంస్కృతంలో వున్న అచ్చులన్నీ హల్లులన్నీ ఈ భాషలో లేవు. విభక్తులను తెలియచెయ్యటానికి వేరే ప్రత్యేకమైన మాటలు చేర్చేవారు కాదు - పదం చివరే అచ్చుల మార్పుతో విభక్తులను తెలియచేసేవారు.

## భాషాశబ్దాలు:

అచ్చులు: ఆ, ఇ, ఉ, ఏ, ఓ

'అ' హ్రస్వమైన 'అ' విడిగా వుండదు - హల్లుతో కలిసే వుంటుంది.

'ఇ' దీనినే 'ఈ' గా కూడ ఉచ్చరిస్తారు. దీనిని 'య' కు బదులుగా కూడ వాడడం జరిగింది.

'ఉ' దీనిని 'వ' కు బదులుగా కూడ వాడుతారు.

'ఎ' దీనిని 'య' కు బదులుగా కూడ వాడతారు.

'ఓ' చాల పరిమితమైన ప్రయోగం. దీనిని 'వ' కు బదులుగ కూడ వాడతారు.

'అమ్' అర్థానుస్వారం, కాని పూర్ణానుస్వారంగాని వాడుకలోకి రాలేదు.

'ఇంద్ర' అని రాయాలంటే ' ఇద్దర' అని రాస్తారు 'శంబర' అని రాయటానికి సమ- బర అని రాస్తారు.

గుణింతాలు: ముఖ్యమైన 3, 4 హల్లులకు మాత్రమే గుణింతాలు సంకేతాల్లో పొట్టిగీతలుగా సూచించారు. మిగతా 'హల్లులకు గుణింతాలు, సందర్భాన్ని బట్టి పాఠకుడు ఊహించుకొని ఉచ్చరించాలి.

## హల్లులు

| | | (Surds) పరుషాలు | (Sopft Consonants) సరళములు |
|---|---|---|---|
| 1) | కంఠవ్యములు (గట్టరల్స్) | క, ఖ | - |
| 2) | తాలవ్యములు (పాలెటల్స్) - | | జ |
| 3) | మూర్ధన్యములు ( లింగువల్స్ లేక, సెరిబ్రల్స్) | - | - |
| 4) | దంత్యములు (డెంటల్స్) | త, థ | ద, ధ, న |
| 5) | ఓష్ఠ్యములు (లాబియల్స్) | ప | బ, భ, మ |
| 6) | అంతస్థములు (సెమిఒవెల్స్) | | య, ర, ల, వ. |
| 7) | ఊష్మములు (సిబిలెంట్స్) | | శ, ష, స |
| 8) | మహాప్రాణి (ఆస్పిరేట్) | | హ |

**సంయుక్తాక్షరాలు:** రెండు హల్లు సంకేతాలను కలిపి ఒకే సంకేతంగా సంయుక్తాక్షరంగా చేశారు.

**సింధు లిపి సంకేతాల సంఖ్య:** - మొత్తం సంకేతాలు దాదాపు 400 దానిలో అచ్చులు, హల్లులు, సంయుక్తాక్షరాలు, ఒకే శబ్దానికి వాడిన అనేక సంకేతాలు (వారియంట్స్), అన్నీ కలిపి మొత్తం - 300 మిగతా 100 సంకేతాల్లో, భావ సంకేతాలు, నిర్ధారక సంకేతాలు, మూడు నాలుగు సంకేతాలతో కూడిన సంయుక్త సంకేతాలు (మోనోగ్రామ్స్)

**లిపి వాడుక :**

ఒక లిపిని ఏ భాష వ్రాయడానికైనా ఉపయోగించవచ్చు. సుమేరియన్ వాళ్ళు కనిపెట్టిన కీల లిపిని (క్యూనిఫార్మ్), వారిని జయించిన సెమెటిక్ భాషా ప్రజలు వాడారు, అది వారి భాషా అవసరాలు పూర్తిగా తీర్చకపోయినా. అదే లిపిని ఆర్య సంతతికి చెందిన హిట్టైట్స్‌కూడ వాడారు, ఈజిప్టుతో, బాబిలోనియా వారితోను సంబంధ బాంధవ్యాల విషయంలో. అందువలన ఒక లిపి వాడుకను బట్టి మాత్రమే ఒకరి భాషను, జాతిని నిర్ధారించలేము. ఈ రోజు మనము రోమను స్క్రిప్టులో తెలుగు, హిందీ వ్రాసినట్లు. అలాగే సింధు లిపిలోని శబ్దాలన్నీ వేదకాలపు సంస్కృత భాషను రాయడానికి చాలవు. ఎందుకంటే సింధు లిపిలో మూర్ధన్యాలు లేవు. అలాగే సెమెటిక్ భాషను సింధు లిపిలో రాయడానికి ఉపయోగపడదు, ఎందుకంటే సింధులిపిలో తాలవ్యాలు లేవు కనుక.

**సింధు లిపి ఆది లిపి:**

ఈజిప్టు, సుమేరియా లిపులవలే సింధు లిపి చాలా పురాతనమైంది. దీన్లో ఇంకా వ్యాకరణం ప్రయోగంలో లేదు. లింగ, వచన, విభక్తి ప్రయోగాలు, క్రియలు, కాలం తెలిపే ప్రయోగాలు లేవు. కొత్తగా అప్పుడే నాగరికులైన ప్రజలు వారి అత్యవసర భావ ప్రకటనకు, గుర్తింపుకు వాడిన లిపి. అందులోనూ ధనవంతులు, వర్తకులు, రాజులు వాడకలిగిన లిపి ఇది. ఎందుకంటే చిన్న రాతి ఫలకలమీద చెక్కడానికి ఎంతో సమయం, నేర్పు, కాలం, ధనం అవసరం. తక్కువ స్థలంలో ఎంతో ఎక్కువ భావాన్ని క్లుప్తంగా ప్రకటించగల తెలివి, ఆలోచన వుండాలి. అందువలన క్లుప్తంగా దేవుళ్ళ పేర్లు, రాజుల పేర్లు, పట్టణాల పేర్లు మాత్రమే చెక్కగలిగారు. పొడుగైన వాక్యాలు ఎక్కడా లభించలేదు.

**భాషా విశ్లేషణ**

ఒక భాషను గురించి బాగా తెలుసుకోవాలంటే దానిని వర్గీకరించాలి, విశ్లేషణకు గురిచెయ్యాలి. ఆ భాషలోని ధ్వనులనూ, పదాలనూ, నామవాచకాలు, విశేషణ, విశేష్యాలు, సర్వనామాలు, క్రియలుగా విభజించి, వాక్య నిర్మాణంలో అర్థాన్ని వ్యక్తం చేయడానికి, లింగ, వచన, విభక్తి పరంగా అవి చెందే మార్పులను అధ్యయనం చేయాలి.

ఆ విధంగా భాషను విశ్లేషించడానికి సంబంధించిన వివరాలు ఇంకా పూర్తిగా ఈ లిపిలో మనకు లభ్యం కాలేదు. అందుబాటులో వున్న వివరాలు భాషా శాస్త్ర వేత్తల ఉపయోగార్థం క్రింద తెలియజేస్తున్నాను.

విభక్తులను నిర్ణయించడానికి ఈ దిగువ లభ్యమైన పదాలను పరిగణనలోకి తీసుకోవచ్చును. ఇవన్నీ దేవుళ్ళపేర్లు పుంలింగాలు.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | - | పమె | - | |
| బబ | - | దమ | - | కవ | - | పవ | - | మె |
| బబన | - | ★ దమన | - | కవన | - | పవన | - | వన |
| బబని | - | ★ దమని | - | కవని | - | పవని | - | వని |
| బబను | - | ★ దమను | - | .... | | పవను | - | వను |
| బబయ | - | ...... | - | కవయ | - | ..... | - | వనియ |
| బబమ | - | ...... | - | కవమ | - | పవమ | - | ...... |
| బబక | - | ...... | - | ..... | - | ...... | - | ...... |
| బబర | - | ...... | - | ...... | - | ...... | - | ...... |
| | | | | కవస | - | ...... | - | ...... |
| | | | | | | | - | వనుప |

ఈ క్రింది ఇచ్చిన పట్టికలలో పదాలు వివిధ దేవతలకు సంబంధించినవి. తద్వారా పట్టణాలు కూడా అవే పేర్లతో పిలవబడ్డాయి. ఈ పదాలన్నీ ఒక పుణ్య వచనంతో (సెక్రెడ్ సిలబిల్)తో మొదలవుతాయి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ని - దమన | పు | సా - సన | స యున | యస | వర |
| ని - వసన | పుసక | సాశన్ | స పున | యసపి | వరన |
| ని - రమన | పుసన | సాసున | స భన | యసిన | వరక |
| ని - తరవ | పుయున | సా బబ | స శబక | యసక | వరస |
| ని - సురవ | పువస | సా స్యోన | సకవ | | |
| ని - మహా | పుభన | సాతవ | సపమ | | |
| ని - వచ | ప్రభస | సారణ | సవన | | |
| ని - రణ | పుసుస | సాత్సవ్య | స విమ్శ | | |
| ని - బల | పు - రణ | సావసా | సరస | | |
| ని - యస | పున | సాసవ | | | |
| ని - ఆన | పువ | సాయున | | | |
| ని - సక | పుధ | సారదన | | | |
| ని - న | పుస | సా పున | | | |

★ అస్సీరియా భాషలో (సెమిటిక్ జాతి) - ప్రథమా విభక్తి - దమను ద్వితీయా విభక్తి - దమన సప్తమీ విభక్తి - దమని

★ అస్సీరియా ప్రజలు మితాన్ని ఆర్యుల క్రింద సామంతులుగా షుమారు 100 సంవత్సరాలు గడిపారు.

★ సప్తసింధులో కూడ అస్సీరియా రాజులు ఆదద్ నిరారి, అసురదాన్, సాల్మనసర్ I అతని కుమారుడు నినిప్ - సెన్నాచెరిబ్, పారను, అస్సుర్బనిపాల్ చాల సంవత్సరాలు పాలించారు. అందువలన అస్సీరియా భాషలో, ఆర్యుల భాషప్రభావం పడి వుండవచ్చు.

**సింధులిపి సంకేతాలు :**


Aa I I E E U U O Ka Ja Ja Ja Ja
Ta Ta Ta Da Da Di Dha Dha Dhi Na Na Na Na Na Naa
Naa Ni Nu Pa Pa Pa Pa Pu Pu Ba Bha Va Va Va
Va Va Va Vara Va Va Va Va Va Va Va Va Va
Va Va Va Va Va Va Va Ma Ma Ma Ma Ma Ma Ma Mi Mi
Ima Ya Ya Ra Ra Ra Ra Ra Ra Ra Ra Ra
Ra Ra Ra Ra Ra La Sa Sa Sa Sa Sa Sa Sa Sa
Shi Saa Su Su Sha Ha Baba Ima Mumu Imma Vara
Vara Ura Vara Babbra Vara Vara Vara Vara Ura Vara




**'మిసిమి'** జూలైలో 3, 4వ అట్టలపై ముద్రించిన చిత్రాలు
ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో.

(సమాప్తం)

# సంస్కృత నాటక సాహిత్యం

**- మువ్వల సుబ్బరామయ్య**

భారతీయుల దార్శనికతను తెలిపేవి వేదాలు. సంస్కృతి వైభవాన్ని విరజిమ్మేవి కావ్యాలు. జీవన విధానంలోని చైతన్యాన్ని రూపుకట్టించేవి రూపకాలు. సంస్కృత సాహిత్యం భారతీయతకు ప్రతిబింబం. సంస్కృత సాహిత్యం సుసంపన్నమైనది, సర్వాంగ సుందరమైంది. అది అందమైన పాల సముద్రం లాంటిది. కాళిదాసు, భాసుడు, భవభూతి, శూద్రకుడు, హర్షదేవుడు, అశ్వఘోషుడు, విశాఖదత్తుడు, రాజశేఖరుడు, శ్రీహర్షుడు, మురారి, ద్విజ్నాగుడు ఇలా ఎందరెందరో తమ రచనలతో సంస్కృత నాటక సరస్వతిని అందంగా అలంకరించారు.

లక్షణ గ్రంథాలలో పది రూపకాలు, పద్దెనిమిది ఉప రూపకాలు చెప్పబడ్డాయి. నాటకం, ప్రకరణం, భాణం, ప్రహసనం, డిమం, వ్యాయోగం, సమవకారం , వీధి , అంకం, ఈహామృగం అనేవి రూపక భేదాలు. నాటిక, త్రోటకం, గోష్ఠి, సట్టకం, నాట్య రాసకం, ప్రస్థానకం, ఉల్లాప్యం, కావ్యం, ప్రేక్షణకం, రాసకం, సంలాపకం, శ్రీగదితం, శిల్పకం, విలాసిక, దుర్మల్లిక, ప్రకరణి, హల్లీశకం, భాణిక అనేవి ఉపరూపకాలు. కథా వస్తువు, రసము, పరిమాణము వీటిని బట్టి ఈ విభాగం చేయబడింది.

కవి కులగురువు కాళిదాసు. ఈయన రచనలను భారతీయులే కాకుండా పాశ్చాత్యులు కూడా ప్రశంసించారు. భారతీయతను కాళిదాసు తన రచనలలో గొప్పగా చిత్రించాడు. మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వశీయం, అభిజ్ఞాన శాకుంతలం అనే మూడు నాటకాలను రచించాడు. మాళవికాగ్ని మిత్రం ఇంగ్లీషు, జర్మన్ మొదలైన యూరోపియన్ భాషలలోకి అనువదించబడింది. ఈ నాటకం షేక్స్పియర్ కామెడీ నాటకాలను తలపిస్తుందని అంటారు. విక్రమోర్వశీయంలో అయిదు అంకాలున్నాయి. ఇది ఉప రూపక భేదమైన త్రోటకం. ఊర్వశీ పురూరవుల వృత్తాంతం ఋగ్వేదంలో ప్రసిద్ధమైంది. ఈ కథ శత పథ బ్రాహ్మణంలో, విష్ణు మత్స్య భాగవత పురాణాలలో కనిపిస్తుంది. ఆ కథను ఆధారంగా తీసుకుని కాళిదాసు ఈ నాటకాన్ని వ్రాసాడు. ఈ నాటకం లాటిన్, ఇంగ్లీషు, జర్మన్, ఫ్రెంచ్, స్వీడిష్, ఇటాలియన్, జెక్, స్పానిష్ మొదలైన యూరోపియన్ భాషలలోకి అనువదించబడింది. ఈ నాటకం మ్యూనిచ్ పట్టణంలో ఓపెరా రూపంలో కూడా ప్రదర్శించబడిందని అంటారు.

కాళిదాసు నాటకాలలో గొప్పది, ప్రపంచ ఖ్యాతి తెచ్చినది అభిజ్ఞాన శాకుంతలం నాటకం. దీనిలో ఏడే అంకాలున్నాయి. శకుంతల కథ మహా భారతంలోను, పద్మ పురాణంలోను కనిపిస్తుంది. మహా భారతంలో మూడువందల శ్లోకాలలో ఉన్న ఉపాఖ్యానాన్ని తీసుకుని కాళిదాసు అపూర్వమైన నాటకాన్ని రచించాడు. ఈ నాటకం అనేక భారతీయ భాషల్లోకి, అనేక పాశ్చాత్య భాషల్లోకి అనువదించబడి గౌరవం సంపాదించింది. కాళిదాసు నాటక కళలో ప్రవీణుడు. అతని నాటకాలలో ఎక్కడా వ్యర్థమైన అంకంగాని, సన్నివేశంగాని, సంభాషణ గాని, పాత్రగాని కనిపించదు. శకుంతల సౌందర్యం వంటిదే కాళిదాసు కవితా సౌందర్యం.

---

మువ్వల సుబ్బరామయ్య, విజయవాడ, సాహిత్య మరమరాలు రచయితగా ప్రసిద్ధులు. జయంతి పబ్లికేషన్ అనే సంస్థను నిర్వహిస్తున్నారు.

ఎందరో సంస్కృత కవీశ్వరులు ఏమాత్రం తమవైనం చెప్పుకోకుండా, సుదూర వినీలాంబరంలో మేఘాల మాటున మినుకు మినుకు మని వెలుగొందే చుక్కల్లా నిలిచిపోయారు. కన్యాకుమారికి ఇరవై మైళ్ళ దూరంలో ఉన్న పద్మనాభపురం సమీపంలోని మణిలిక్కర మఠంలోని మహామహోపాధ్యాయ గణపతి శాస్త్రిగారు మనకు భాసుని రచనలు ప్రసాదించారు. భాసుని నాటకాలు ఎనిమిది మళయాళ లిపిలో ఆయనకు దొరికాయి. ఈ వ్రాతప్రతులు మూడువందల సంవత్సరాల పాతవట. తరువాత ఆయనకే త్రివేండ్రం పాలేస్ లైబ్రరీలో మరి రెండు, మద్రాసు ఓరియంటల్ మాన్‌స్క్రిప్టు లైబ్రరీలో మళయాళ భాషలో మూడు లిఖిత ప్రతులు దొరికాయి. దేవనాగర లిపిలో ఒక ప్రతి కూడా దొరకలేదు. గణపతి శాస్త్రిగారికి దొరికిన పదమూడు నాటకాలను 1912-13లో త్రివేండ్రం నుంచి ప్రచురించారు. వెంటనే అవి ప్రపంచంలోని సంస్కృతజ్ఞులందరి దృష్టిని ఆకర్షించాయి. అప్పటి నుండి భాసుడు సంస్కృతంలో మొదటి నాటక కారుడుగా కీర్తి గడించాడు. భాసుని కాలం ఇది అని నిర్ణయించి చెప్పడానికి ఆధారాలు లేవు. కొండంత భావాన్ని కోమలమైన పదంతో చెప్పడం ఆయనకు పరిపాటి. కాళిదాసంతటి ప్రతిభావంతుడు భాసుని రచనా సంవిధానానికి పరవశుడై జేజేలు పలికాడట!

భాసుడు మొత్తం ఇరవైనాలుగు నాటకాలు రాశాడని ప్రసిద్ధి. కాని ఇప్పుడు మనకు పదమూడు నాటకాలు మాత్రం లభ్యమైనాయి - దూత వాక్యం, కర్ణభారం, దూత ఘటోత్కచం, ఊరు భంగం, మధ్యమ వ్యాయోగం, పంచరాత్రం, అభిషేకం, బాలచరిత్ర, అవిమారకం, ప్రతిమ, ప్రతిజ్ఞా యౌగంధరాయణం, స్వప్నవాసవదత్త, చారుదత్త మొదలైనవి. యజ్ఞఫలం అనే మరో నాటకం కూడా తర్వాత లభించింది. ఈ పద్నాలుగు నాటకాలను భాసనాటక చక్రం అంటారు. భాసునికి మానవులంతా మంచివారుగానే కనిపిస్తారు. తన నాటకాలలో విధివిలాసాన్ని చాలా చక్కగా చిత్రిస్తాడు. విధి వక్రించడం చేత వారు ఆయావిధంగా ప్రవర్తించారని నమ్ముతాడు. అందుచేతనే ఆయన దుర్యోధన, కర్ణ, కైకేయి మొదలైన పాత్రలను మానవ మాత్రులుగా సానుభూతికి పాత్రులుగా చిత్రించాడు. తరువాతి నాటక కర్త లెవరూ ఇలాటి పాత్ర చిత్రణకు పూనుకోలేదు.

క్రీ.శ. 1893 వరకు అశ్వఘోషుడు బౌద్ధవేదాంతిగానే పరిచయం కాని, కవిగా కాదు. అతని కావ్య నాటకాలు బయట పడిన తరువాత అతన్ని కాళిదాసాది కవుల కోవకు చేర్చడం జరిగింది. 1910 వరకు అశ్వఘోషుడు కావ్యకర్తగానే తెలుసు. మధ్య ఏషియాలోని తుర్ఫాన్ ప్రాంతంలో లుడర్స్‌కు మూడు సంస్కృత నాటకాల లిఖిత ప్రతుల అవశేషాలు దొరికాయి. అందులో ఒకటి శారి పుత్ర ప్రకరణం. దీనికే శారద్వతీ పుత్ర ప్రకరణమని పేరు. దీని చివర సువర్ణాక్షపుత్రుడు అశ్వఘోషుడు తత్సంధకర్తగా పేర్కొనబడ్డాడు. దీనిలో తొమ్మిది అంకాలున్నాయి. అశ్వఘోషునికి భరతుని నాటక లక్షణాలు బాగా స్థిర పడ్డాయి. అశ్వఘోషుడు భరతనాటక లక్షణాలను పూర్తిగా అనుసరించి ఈ నాటకం రచించాడు. సిల్వీలెవీ ప్రకరం 'రాష్ట్రపాలు'డనే గేయ నాటకం అశ్వఘోషుని రచన. కొద్ది అవశేషం మాత్రం దీనిది దొరికింది.

శూద్రకుడు మృచ్ఛకటికం అనే నాటకాన్ని రచించాడు. ఇది భాసుని చారుదత్త నాటకానికి

అనుసరణ. మృచ్ఛకటికం సమకాలీన సాంఘిక, ఆర్థిక, ధార్మిక పరిస్థితులను వాస్తవంగా చిత్రిస్తున్నది. సంస్కృత సారస్వతంలో ఇలా వాస్తవ చిత్రణగల రచనలు చాలా అరుదు. దీనిలోని పాత్రలన్నీ నిజ జీవితంలో మనకు ఎదురు పడేవే! ఆదర్శ వ్యక్తులు ఎవరూ లేరు. రాజులు, బ్రాహ్మణులే కాకుండా విటులు, జూదగాళ్లు, దొంగలు దీనిలోని పాత్రలు. దీనిలోని ఇతివృత్తం పురాణాలలోనిది కాదు, కల్పిత ఇతివృత్తం. మృచ్ఛకటిక నాటకం భారతీయ భాషలలోనే కాక ఇంగ్లీషు, జర్మన్, ఫ్రెంచ్, స్పేనిష్, డానిష్, ఇటాలియన్, రష్యన్ మొదలైన యూరోపియన్ భాషలలోకి అనువదించబడింది. ఫ్రాన్స్, జర్మనీ దేశాలలో ఇది రంగస్థలం మీద విజయవంతంగా ప్రదర్శించబడిందట!

విశాఖ దత్తుని ప్రసిద్ధ నాటకం ముద్రారాక్షసం. ఇదే కాకుండా దేవీ చంద్ర గుప్తము, అభిసారికా వంచితకం లేదా అభిసారికా బంధితకం అనేవి కూడా వ్రాశాడని అంటారు కాని, అవి లభ్యం కావడం లేదు. ముద్రారాక్షసం కథకు నిర్దిష్ట మూలం లేదు. చాణక్యుడు నందులను నాశనం చేసి, వారి రాజ్యాన్ని చంద్రగుప్తునికి అప్పగించే చరిత్ర, కొంత జనంలో ప్రచారమైన కథను తీసుకుని, తన ప్రతిభతో కొంత కల్పించి నాటక కథను తయారు చేశాడు. ఈ నాటకం బయట పడనంత వరకు సముద్ర గుప్తునికి, చంద్ర గుప్తునికి మధ్య అతని అన్న రామ గుప్తుని వృత్తాంతం, చంద్రగుప్తుడు శకులను ఓడించిన సాహస గాథ బయటపడింది. తర్వాత రామగుప్తుని నాణేలు దొరికాయి.

భవభూతి రచనలుగా మూడు నాటకాలు ప్రసిద్ధమైనాయి, మహావీర చరిత్ర, మాలతీ మాధవం, ఉత్తరరామ చరిత. భవభూతి హాస్యరసాన్ని తప్ప మిగతా రసాలన్నింటిని సందర్భాను కూలంగా పోషించాడు. వీర, కరుణ రసాలలో సిద్ధహస్తుడు. తన మూడు నాటకాలలో మూడు రసాలను అంగిరసాలుగా పోషించాడు.

స్థాణేశ్వరాన్ని రాజధానిగా చేసుకుని అసమదేశం (అస్సాం) మొదలు సౌరాష్ట్రవరకు, హిమాలయాలు మొదలుకుని వింధ్యాచలం వరకు విశాల సామ్రాజ్యాన్ని పరిపాలించిన చక్రవర్తి హర్షవర్ధనుడే నాటక కారుడు హర్షదేవుడు. ప్రియదర్శిక, రత్నావళి, నాగానందం అనే మూడు నాటకాలను రచించాడు. నాగానందం అయిదు అంకాల నాటకం. దీనిలో జీమూత వాహనుని కథ. బుద్ధుని స్తుతి వుంది. ప్రియదర్శిక, రత్నావళి నాటకాలలో ఇతివృత్తం ఒక్కటే. ఇతివృత్తం బృహత్కథ నుండి తీసుకున్న ప్రేమకథ, వత్సరాజు ఉదయనుడు, భార్య వాసవదత్త, ప్రియురాలు ప్రియదర్శిక చుట్టూ కథ తిరుగుతుంది. హర్షుడు భవభూతి వలె గంభీర స్వభావం కలవాడు కాదు. మృదు స్వభావుడు, రసిక హృదయుడు. కాబట్టే తన నాటకాలలో మృదు మధుర శృంగార రసాన్ని సమర్థవంతంగా పోషించాడు. హర్షుని నాటకాలలో నాటక కళ, కవిత్వంతో పాటు పాత్ర చిత్రణ కూడా ఉత్కృష్టంగా వుంది. గొప్ప పండితుడు, నాటక కర్తగా కవిగా ఖ్యాతి పొందాడు.

ఇలా ఎందరో మహానుభావులు సంస్కృత నాటకాలను మనకు అందించి ధన్యులైనారు. క్రీ.శ. 1870లో హెచ్.హెచ్. విల్సన్ సంస్కృత నాటకాలు మొత్తం అరవై వరకు ఉన్నట్లు పట్టిక తయారు చేశాడు. క్రీ.శ. 1890లో లెవీ మూడువందల డెభ్భైరెండు సంస్కృత నాటకాల పట్టిక తయారు చేశాడు. మాంటెగ్ మేరీ ఘూలెర్ అయిదు వందల సంస్కృత నాటకాల పట్టిక తయారు చేశాడు. మరుగున పడిన మాణిక్యాలు ఎన్నో?!

# పత్రికల్లో పాపులర్ సైన్స్

– నాగసూరి వేణుగోపాల్

పత్రికలలో సైన్స్ పత్రికలు దాదాపు కనబడనప్పుడు పత్రికల్లో సైన్సును వెతుక్కోవాలి! అందుకే ఈ శీర్షిక. ఎంతోకాలం విజయవంతంగా నడచిన ''సైన్స్‌టుడే'' (కొంతకాలం 2001 గా పేరు మార్చుకుంది) ఆగిపోయింది. ''టైమ్స్ ఆఫ్ ఇండియా'' వంటి సంస్థే నిర్వహించలేక ఈ పత్రికను మూసివేసినపుడు చిన్న సంస్థలు నడిపే పత్రికలు ఎంతకాలం వుంటాయి? సైన్స్ టుడే నడుస్తున్న కాలంలోనే ముంబైనుంచి నెహ్రూ సెంటర్‌వారు ''సైన్స్ ఏజ్'' అనే సైన్స్ మాస పత్రికను అద్భుతంగా వెలువరించేవారు. ఆ పత్రిక గొప్పగా వున్నా అది ఎంతోకాలం నడవలేకపోయింది. కేవలం ''సైన్స్ రిపోర్టర్'', ''డవున్ టు ఎర్త్'' మాత్రం ఇప్పుడు వెలువడుతున్న సైన్స్ పత్రికలని పేర్కోవాలి. పాపులర్ బాణీలో, సమగ్ర దృక్పథంతో, సాధికారంగా వెలువడే పత్రికలుగా వీటిని చెప్పుకోవాలి. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజి వంటి అంశాలమీద పత్రికలు వెలువడుతున్నాయి. ఇవన్నీ రూపుదిద్దుకుంటున్న పరిశ్రమలో భాగంగా - వ్యాపార లక్ష్యంతో నడుస్తున్న వాటిగా చెప్పుకోవాలి. అందుకే ఈ పత్రికలు ఆకర్షణీయంగా, ఖరీదుగా వుంటాయి. మేధావుల భాషగా పిలువబడే ఆంగ్లభాషలోనే పరిస్థితి ఇలా వుంటే తెలుగువంటి ప్రాంతీయ భాషలలో తీరు విభిన్నంగా వుండే అవకాశమే లేదు. అది యింకా అధ్వాన్నంగా వుండవచ్చు. గతంలో ''అవంతి'', ''సైన్స్‌వాణి'' వంటి సైన్స్ పత్రికలు తెలుగులో వచ్చినా అవి ఎంతోకాలం నడువలేదు. ప్రస్తుతం సైన్స్ పత్రిక అంటూ తెలుగులో అసలుందా? - అనే ప్రశ్న ఎదురయినా ఆశ్చర్యపోనక్కరలేదు. వైద్యం సంబంధించి కొన్ని చిన్న పత్రికలు తెలుగులో వెలువడుతున్నాయి. కానీ, సైన్స్ పత్రికగా ఒక సమగ్ర రీతిలో ఏదీ లేదనే చెప్పాలి. ఒక్క మినహాయింపుగా వ్యవసాయం కోసం ''అన్నదాత'', ''పాడిపంటలు'' వంటి వాటిని పేర్కొనవచ్చు.

ఈ నేపథ్యంలో - వెలువడుతున్న దిన పత్రికలో వుండే సైన్స్ అంశాలపట్ల దృష్టి మళ్లించక తప్పడం లేదు. మొదట ఆంగ్ల పత్రికల ధోరణిని పరిశీలిస్తే - హిందూ, టెలిగ్రాఫ్, డెక్కన్ హెరాల్డ్ లాంటి పత్రికలు వారంలో ఒక రోజు ప్రత్యేక అనుబంధాలు ప్రచురించడం ఒక పద్ధతి కాగా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లాగా వారంలో ఒక రోజు సైన్స్ పేజి యివ్వడం మరో పోకడ. ఈ రెండు పద్ధతుల్లో యిచ్చే పరిమాణంలో మార్పు వుండటం ఒక అంశం కాగా - యిచ్చే పద్ధతిలో మార్పు వుండటం మరో అంశం. కేటాయించే స్థలం ఎక్కువయితే ద్యోతకమయ్యే వైవిధ్యం కూడా అధికం కావడం సహజం. ఇక తర్వాతి అంశం - యిచ్చే తీరు! ఏదో అంతర్జాతీయ వార్తా సంస్థల నుండి వచ్చిన నివేదికలు, వార్తలు అలానే యివ్వడం ఒకరకం కాగా - మన దేశ పాఠకులకోసం మన రచయితలతో మరలా రాయించడం మరో పద్ధతి. మొదటి పద్ధతి పత్రికలకు చాలా సౌలభ్యం కాగా, రెండవది పాఠకులకు సౌకర్యంగా వుంటుంది. ఒకరు సుఖపడితే, మరొకరు కష్టపడక తప్పదు. అదీ ఇందులో వుండే ధర్మసూక్ష్మం.

---

నాగసూరి వేణుగోపాల్, విజయవాడ, ఆకాశవాణిలో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు.

ఇదివరకే అనుకున్నట్టు కేటాయించిన స్థలంలో పరిమితి తక్కువ వుంటే ఎక్కువ విషయాలు వచ్చే అవకాశం వుంది. ప్రత్యేక అనుబంధాలూ, పేజీలూ లేని టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందూస్థాన్ టైమ్స్, డెక్కన్ క్రానికల్ వంటి పత్రికలు వారాంతపు సంచికలలోనూ, దినసరి సంచికలలో సైన్స్ యిస్తుంటారు. ప్రయోగించబడిన ఉపగ్రహం, మిర్, స్కైలాబ్, పాత్ ఫైండర్, అంగారకుడి మీద నీరు, క్లోనింగ్, జినోం ప్రాజెక్టు వంటి అంశాలయితే అవి తొలిపుటలలో వేస్తాయి. లేదంటే సైన్స్ కోసం అంతర్జాతీయ వార్తల పేజీలో చూసుకోవాలి. ఇలా ఫలానా పేజీలో సైన్స్ వుంటుంది అనడం చదువుకునేవారికి ఒక సౌఖ్యం అయినా, యిక్కడ మనం గమనించాల్సిన అంశం మరోటి వుంది. అంతర్జాతీయ వార్తా సంస్థలు పంపే వార్తల్లో సైన్స్ వుంటుంది కనుక సైన్స్ వార్తలు అక్కడ వుంటున్నాయని మనం గమనించాలి. అంటే దేశవాళి సైన్స్ వార్తలు అంత ప్రాధాన్యతకు నోచుకోవడం లేదని వేరుగా చెప్పక్కరలేదు. దీనికి అవసరమైన మందీ, మార్బలం మన పత్రికలకు లేవని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఏది సైన్స్, ఏది కాదో - అని తెలియకపోవడంతో సైన్స్ వార్తలనేవి ఫిల్లర్స్‌గా మారిపోతున్నాయి. ఏవో రెండు, మూడు పత్రికలను జాగ్రత్తగా పరిశీలిస్తే - ఎందుకంత తేడా వుంటుందో మనం విశ్లేషించుకోవచ్చు. సైన్స్ ప్రాధాన్యత గురించి పాత్రికేయులలో అవగాహన తక్కువ వుండటమే కాదు, యాజమాన్యాలకు కూడా దీని అవసరం మీద ఆసక్తి లేకపోవడం కూడా మరో కారణం.

ఎక్కువ పేజీలు, ఎక్కువ మంది నిపుణులుండే ఆంగ్ల పత్రికలు యిలా కనబడుతుంటే - తెలుగు పత్రికల పరిస్థితి ఏమిటి? స్పోర్ట్స్ లాగా సైన్స్ కూడా ముఖ్యమైన అంశంగా గుర్తించడం యిక్కడ జరిగినా - దానికి ఏమి అవసరం, అదెలా వుండాలనే అవగాహన మీద దృష్టి సారించినట్టు కనబడదు. చాలా ప్రధానమైన వార్తలుగా వచ్చిన సైన్స్ అంశాలు మనకు కనబడుతాయి కానీ - మిగతా వార్తలలో ఒక క్రమం ఉండదు. పత్రికలలో కూడా సైన్స్ డెస్క్ అంటూ ప్రత్యేకంగా వుండక, ఏదో యితర డెస్కులలో భాగంగానో, లేక అసలు లేకుండానో పోతుంది. అయితే కొందరు పాత్రికేయులలో సహజంగా ఆసక్తి ఉన్నవారు లేకపోలేదు. వారి కారణంగానే కొన్ని సైన్స్ అంశాలు సరయిన రీతిలో ప్రచురించబడినా, మరుసటిరోజు దానికి తగిన రీతిలో ఫాలో అప్ ఉండదు. ఇక్కడ ఒక నిపుణుడు రెగ్యులర్‌గా లేకపోవడం అనేది కొట్టొచ్చినట్టు తెలుస్తుంది. ఇలా ప్రత్యేకంగా మనుషులు, డెస్కులు లేకపోవడం విషయంలో పత్రికల నిర్వాహకులకు వారి సమస్యలు వారికుంటాయి. ఇది ఇక్కడ చర్చనీయాంశం కాదు. అయితే కనబడే ధోరణికి ఒక పరిశీలనే యిది. ఇటువంటి విశ్లేషణ వల్ల పత్రికలకు అదనపు వనరులు కల్గిస్తే మరీ మంచిది!

ప్రస్తుతం తెలుగు పత్రికలలో సైన్స్ పేజీ అంటూ విడిగా లేకుండా - ఆదివారం అనుబంధాలలో ఒక పేజీగా మారిపోయింది. కొన్ని పత్రికలలో ఆదివారం సంచికలో పేజీలు పెరిగినా ఆ మేర సైన్స్ అంశాలు పెరగడం లేదు. ఇప్పుడు ఏ అంశాలు సైన్స్ వార్తలుగా వెలువడుతున్నాయో కొంచెం పరిశీలిద్దాం. పత్రికలు సంచలన పత్రికలుగా మారి పోతున్నాయన్న విమర్శ ఇక్కడ కూడా వర్తిస్తుందని ఒప్పుకోవాలి.

1979లో స్కైలాబ్ పడిపోవడం, 1980 సంపూర్ణ సూర్యగ్రహణం నుంచి 1999 చివర్లో వైటుకె దాకా బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన ప్రతి సైన్స్ వార్త కూడా సంచలన వార్తే! 'స్కైలాబ్' విషయంలో పత్రికలు అవగాహన లేకుండా జనాలను బెంబేలెత్తించాయని - అవే పత్రికలు 'మిర్' పడిపోయినప్పుడు విశ్లేషించుకున్నాయి. అలాగే సంపూర్ణ సూర్యగ్రహణం అనే అపురూప అవకాశాన్ని చేజేతులా వదులుకోవడంలో మీడియా పాత్ర ఎంతో వుందని తెలియంది కాదు. రామర్ పిళ్ళై పెట్రోలు మండుతుందని వచ్చిన వార్తలకు యిచ్చిన ప్రాధాన్యత, అది పెట్రోలు కాదని వెలువడిన విశ్లేషణలకు యివ్వలేదు. ఇటువంటి వాటికి చాలా ఉదాహరణలు చూపవచ్చు. దాదాపు పదేళ్ళ క్రితం వెలువడిన 'కోల్డ్ ఫ్యూషన్' విజయం వార్తలు, అపజయం పొందాక ప్రాచుర్యానికి నోచుకోలేదు. ఈ ధోరణికే - ముందుగా వచ్చిన 'టెంపుల్‌టటల్' ఉల్కాపాతం గురించి సరిగా వివరించలేని ధోరణి వంటి వాటికీ కారణం ఒకటే. సైన్స్‌లో మీడియా స్పెషలైజ్ చేయకపోవడం. 'కేసిని' ఉపగ్రహం ఫెయిలయితే కలగబోయే ప్రమాదాలు ఎంత పెద్దవో రాసిన పత్రికలు అటువంటి నైపుణ్యం వుంటే ఎటువంటి సమస్యలేకుండా ప్రయోగించబడినప్పుడు ఎందుకు 'ఫాలోఅప్' యివ్వలేదు? ఇది కేవలం సైన్స్ వార్తల విషయంలోనే కాదు అంతర్జాతీయ వార్తల విషయంలో కూడా తరచు జరుగుతూ వుంటుంది. ఈ విషయంలో సంస్థాగత సమస్యలు వున్నా, చదువరికి మాత్రం ఇబ్బంది అవుతుంది.

1999 నవంబరు నుంచి 2000 జనవరి దాకా పత్రికలలో సైన్స్ ఎలా వుందని ఢిల్లీకి చెందిన విగ్యాన్ ప్రసార్ **(Vigyan Prasar)** 31 హిందీ పత్రికలు, 21 ఇంగ్లీషు పత్రికలను అధ్యయనం చేసింది. సగటున ఆంగ్ల పత్రికల్లో 3.3 శాతం అంశాలూ; హిందీ పత్రికల్లో 2.5 శాతం అంశాలు వున్నట్టు స్పష్టమయ్యింది. తెలుగు పత్రికలకు సంబంధించి యిటువంటి సర్వే జరిగినట్టులేదు. ముందు ముందు అటువంటి ప్రయత్నం జరగాలి. అప్పుడు వాస్తవచిత్రం తేటతెల్లం అయినా - మన తెలుగు పత్రికల్లో పరిస్థితి యింతకంటే మెరుగ్గా వుందని చెప్పలేం. కానీ విశ్లేషిస్తే మరిన్ని ఆసక్తికరమైన అంశాలు వెలికి రావచ్చు.

సాధారణంగా సమాచారం లేదా ఇన్‌ఫర్మేషన్ నుంచి నాలెడ్జ్, నాలెడ్జ్ నుంచి విజ్‌డమ్ వస్తుందంటారు, బాట అలాసాగాలి. ఇపుడు కనబడే ధోరణి ఏమంటే మనం తొలిదశలోనే ఆగిపోవడం. కేవలం రకరకాల సమాచారం యివ్వడంతో సరిపోతుంది. నాలెడ్జ్, విజ్‌డమ్ స్థాయిల గురించి పట్టించుకోకపోవడం అనేది సైన్స్ వార్తల విషయంలో కూడా కనబడుతుంది. అందుకే చాలా అంశాలు దారీ, తెన్నూ లేకుండా యివ్వబడుతూ వుంటాయి. పోనీ వార్తలు యిలా వున్నా వ్యాసాలు, విశ్లేషణలు - నాలెడ్జ్, విజ్‌డమ్ స్థాయిలో వుండాలి. ఇది చాలా తక్కువ అని దిలీప్ సాల్వీ యిటీవల వెలువరించిన అధ్యయనం చెబుతోంది. ఈ స్థితికి రెండు వర్గాలు కారణం. ఒకవైపు పాపులర్ సైన్స్ రచయితలు, రెండోవైపు పత్రికలు! మొదట రచయిత పాత్ర చూద్దాం. జర్మనీ సంస్థకోసం భారతీయ భాషలలోని 20 సైన్స్ పుస్తకాలు పరిశీలించి, మన పుస్తకాలలో ఎక్కువ సమాచారం, తక్కువ భావనలు **(Concepts)**, తక్కువ ఫోటోలు, ఆహ్లాదరహితమైన శైలి వుంటోందని యిదివరకు పేర్కొన్న అధ్యయనంలోనే

పేర్కొన్నాడు. రచయితలు పత్రికల మీద బాధ్యత తోసివేసినా, యిక్కడ మాత్రం రచయితలుగా దొరికిపోతున్నారు. అంటే కేవలం సమాచార సేకరణ మాత్రమే కాదు, ఏది వాడాలి, ఎలా వాడాలి, ఎందుకు వాడాలి, దేనికోసం వాడాలి, ఎవరికి వాడాలి - అని స్పష్టమైన అవగాహన ఉంటే ఈ విమర్శ రాదు. అందుకే యితర రచయితలకన్నా పాపులర్ సైన్స్ రచయితలకు ఎక్కువ సామర్థ్యాలు కావాలి. ఎక్కువ పరిశ్రమ కావాలి అని అనడంలో అతిశయోక్తి లేదు. పాపులర్ సైన్స్ రచనలలో రచయితలే, కొన్ని విషయాలు గమనించలేనప్పుడు ఎన్నో రకాల వార్తలు చూసే, రాసే పాత్రికేయ మిత్రుల విషయం ఏమిటి?

తర్వాత ఏది సైన్స్, ఏది కాదు - అని చాలా అయోమయం వుంటుంది. వైద్యం, వ్యవసాయం, పర్యావరణం, టెక్నాలజీ వంటి అంశాలు కలసి వున్న విస్తృత కాన్వాసు గలదే సైన్స్. అంతేగాని ముక్కలు, ముక్కలుగా విడదీసికాదు. ఈ పలురకాల సమాచారంతో పాటు ఆసక్తి కల్గించడానికి సైన్స్ చరిత్ర, సైంటిస్టుల జీవిత విశేషాలు యివ్వడంలో సైన్స్ అభినివేశం ఉండాలి. ఎంత సైన్స్ ప్రగతి కల్గినా, అది మానవ కళ్యాణానికి తోడ్పడాలి. అంతేకానీ వినాశనానికో, వాణిజ్య ప్రయోజనానికో కాదు. ఇక్కడే సామాజిక శాస్త్రాలు, నైతిక శాస్త్రాలు అవసరమవుతాయి. ఇవికూడా కలిస్తే కాని సమగ్రతకాదు. అలాగే పర్యావరణం, జనాభా, ఎయిడ్స్, సామాజిక ఆరోగ్యం వంటివాటి మీద అన్ని పార్శ్వాలలో విశ్లేషణలూ, వివరణలూ రావడం లేదు. ఈ విషయంలో మనందరం దృష్టి మళ్లించక తప్పదు.

ఇలా ఎన్నో విషయాలు పరిశీలిస్తే పత్రికల్లో ప్రత్యేకంగా సైన్స్ ఎడిటర్లు ఉండాలని విగ్యాన్ ప్రసార్ అన్న విషయానికి మనం వత్తాసు పలకవచ్చు. అప్పుడు పత్రికల్లో పాపులర్ సైన్స్ మెరుగుపడుతుంది, పాపులర్ సైన్స్ రచయితలూ మెరుగుపడతారు. అట్లని ఎవరి వ్యక్తిగత బాధ్యతను వారు విస్మరించకూడదు.

*('తెలుగులో సైన్సు రచనలు' సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి నిర్వహించిన వర్క్ షాపులో చదవబడిన ప్రసంగ పాఠం).*

## సవరణ

జులై సంచికలో ''యక్ష ప్రశ్నలు ముచ్చటగా మూడో పది!'' రచయిత సి. ధర్మారావు, 'మరో ప్రపంచం' పత్రిక సంపాదక వర్గంలో వున్నారు అని ప్రచురించినాము ఇది సరికాదు, వారు విజయవాడ నుండి వెలువడే 'నడుస్తున్న చరిత్ర' మాస పత్రికకు గౌరవ సంపాదకులుగాను, 'మాతృభాషా సమితి' అధ్యక్షుడుగాను వున్నారు. – సం



**మొహెంజోదారోలో ఎత్తైన కోట దిబ్బలోని (Citadel) శిథిలాలు, సింధునాగరికత కాలానివి. రాజప్రాసాదం, ధాన్యాగారం, స్నాన ఘట్టము - తటాకము, ముఖ్య పురోహితుని భవనం - దేవాలయం, ఇతర పురోహితుల, పరిజనుల, విద్యార్థుల ఆవాసాలు. ఈ శిథిలాలపై చాలాకాలం తర్వాత నిర్మించబడిన బౌద్ధ స్థూపం - విహారాలు.**

ఈ బౌద్ధ స్థూపం క్రింద ఏముందో ఇంతవరకు ఎవరికీ తెలియదు, అక్కడ తవ్వకాలు జరపలేదు కనుక. ఈజిప్టు - సప్తసింధు వ్యాస రచయిత శ్రీకృష్ణారావు జరిపిన సింధులిపి విశ్లేషణలో - ఈ స్థూపం క్రింద Great Temple of Belns (శక - ఇతి) బాబిలోన్ నగరంలో లాగ ఉన్నదని ధృవపడ్డది. క్రింది ముద్రికను గమనించండి. ఇది మొహంజోదారోలో, స్థూప సమీపంలో తవ్వకాల్లో లభ్యమైంది.



మహాశక్తివంతమైన (సూర్యుని) శక　　　వెలుగుతున్న మందిరం

MISIMI/మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No.H/SD/191



## మొహంజోదారో సిటెడెల్‌లోని తటాక స్నానఘట్టము

39 × 23 అడుగుల కొలతలతో వున్న ఈ తటాక స్నానఘట్టమునకు చుట్టూవిడివిడి గదులు ఒక వైపు ధాన్యాగారం, ఒకవైపు ముఖ్య పురోహితుని అవాసము, ఇతర పురోహితుల, విద్యార్థుల వసతి, దేవాలయము? కలవు

(3వ, 4వ అట్టపై చిత్రాలు Civilizations of The Indus Valley and Beyond - By Sir Martimer Wheeler; పుస్తకములోనివి. Thames and Hudson, London, 1966 వారి సౌజన్యంతో.).